WANTED

**జిల్లాల వారీగా ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ / మండల రిపోర్టర్లు కావలెను.**

తెలంగాణ అస్తిత్వానికి మార్గదర్శిగా, ప్రజా గొంతుకగా మీ ముందుకు వస్తున్న "వారధి తెలుగు దినపత్రిక" లో పనిచేయుటకు ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ /మండల రిపోర్టర్లు ను ఆహ్వానిస్తోంది. అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు.. ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.

**సంప్రదించాల్సిన నెంబర్లు:**
**9492580091**



Facebook.varadhinews

విశ్వ

# వారధి

తెలుగు దిన పత్రిక

www.varadhinews.com

సంపుటి:1
సంచిక:87
మంగళవారం,
03.12.2024




## త్వరలో గ్రూప్–1 నియామకాలు

- ఏడాదిలో 50 వేల ఉద్యోగాలిచ్చాం
- విద్య, వైద్యమే మా ప్రాధాన్యం
- ప్రజాప్రభుత్వంపై కుట్రలు చేసే వారికి ప్రజలే బుద్ధి చెప్పాలి
- ప్రజా విజయోత్సవాల్లో సీఎం రేవంత్ రెడ్డి

..మిగతా 2 లో







# మావోయిస్టులపై విషప్రయోగం?

- భోజనంలో మత్తు పదార్థాలు
- అగ్రనేతల ఆచూకీ చెప్పాలని చిత్రహింసలు
- మావోయిస్టుల మృతదేహాలపై తీవ్ర గాయాలు
- డెడ్ బాడీలను కుటుంబ సభ్యులకు చూపించలేదు
- నిబంధనలకు విరుద్ధంగా పోలీసుల తీరు
- ఇది ముమ్మాటికీ బూటకపు ఎన్‌కౌంటర్
- హైకోర్టులో హక్కుల సంఘం న్యాయవాది వాదనలు
- మృతదేహాలను మంగళవారం వరకు భద్రపరచండి
- కుటుంబ సభ్యులకు, బంధువులకు చూపించండి
- ఎన్‌కౌంటర్‌పై విచారణను నేటికి వాయిదా వేసిన హైకోర్టు
- విషప్రయోగం అబద్ధమన్న డీజీపీ జితేందర్

వారధి, స్టేట్ బ్యూరో:

ములుగు జిల్లా ఏటూరు నాగారంలో జరిగిన మావోయిస్టుల ఎన్‌కౌంటర్ ముమ్మాటికీ బూటకమేనని పౌరహక్కుల సంఘం మండిపడుతోంది. మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై సోమవారం నాడు హైకోర్టులో విచారణ జరిగింది. పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని పౌరహక్కుల సంఘం తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. భోజనంలో మత్తుపదార్థాలు కలిపి మావోయిస్టులను కస్టడీలోకి తీసుకున్నారని, చిత్రహింసలకు గురిచేసి కాల్చిచంపారని న్యాయస్థానానికి తెలిపారు. మావోయిస్టుల మృతదేహాలపై తీవ్ర గాయాలు ఉన్నాయని న్యాయవాది కోర్టులో వాదించారు. కనీసం వారి మృతదేహాలను కుటుంబ సభ్యులకు చూపించకుండా పోస్టుమార్టం చేశారన్నారు. ఎన్‌హెచ్ఆర్సీ నిబంధనలకు విరుద్ధంగా మావోయిస్టుల పట్ల పోలీసులు వ్యవహరించారని హైకోర్టుకు తెలిపారు. అయితే అడవిలో పోలీసుల భద్రత దృష్ట్యా మృతదేహాలను వెంటనే ములుగు ఆస్పత్రికి తరలించామని కోర్టుకు ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. కాకతీయ మెడికల్ కళాశాలకు చెందిన వైద్య నిపుణుల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారన్నారు. ఈ ప్రక్రియను మొత్తం వీడియో తీశారని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. ఇరువురి వాదనలకు విన్న

..మిగతా 2 లో

### విషప్రయోగం దుష్ప్రచారమే: డీజీపీ

ఏటూరునాగారంలో మావోయిస్టుల ఎన్‌కౌంటర్ అంశంపై తెలంగాణ డీజీపీ జితేందర్ స్పందించారు. మావోయిస్టులపై విష పదార్థాలు ప్రయోగించారనేది దుష్ప్రచారమేనన్నారు. వారు స్పృహ కోల్పోయాక కాల్పులు జరిపామనడం అవాస్తవమని తెలిపారు. " పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులపై మావోయిస్టులు అత్యాధునిక ఆయుధాలతో కాల్పులు జరిపారు. పోలీసుల కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మరణించారు. హైకోర్టు, ఎన్‌హెచ్‌ఆర్‌సీ సూచనల మేరకే శవపరీక్షలు నిర్వహించాం. ఎన్‌కౌంటర్ కేసు దర్యాప్తు అధికారిగా వేరే జిల్లా డీఎస్పీని నియమించాం" అని వివరించారు.

### అసలేం జరిగిందంటే..

ములుగు జిల్లా ఏటూరు నాగారం అడవుల్లో ఆదివారం తెల్లవారుజామున జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో ఓ మహిళ సహా.. నర్సంపేట-ఇల్లందు ఏరియా కమిటీ కార్యదర్శి కుర్సం మంగు అలియాస్ భద్రు, ఏటూరునాగారం-మహాదేవ్‌పూర్ డివిజన్ కమిటీ కార్యదర్శి ఈగోలపు మల్లయ్య అలియాస్ మధు ఉన్నారు. వీరిలో మధు స్వస్థలం పెద్దపల్లి జిల్లా రాణాపూర్ కాగా.. మిగతా ఆరుగురు ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారు.





## కానిస్టేబుల్ పరువు హత్య

- సొంత అక్కను నరికి చంపిన తమ్ముడు
- కులాంతర వివాహం చేసుకుందని పగ
- ఇబ్రహీంపట్నం వద్ద దారుణ ఘటన
- హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నాగమణి
- శ్రీకాంత్‌తో నెలకింద కులాంతర వివాహం
- సోమవారం పీఎస్‌కు వస్తుండగా దారుణ హత్య
- దారికాచి కారుతో ఢీకొట్టి.. కత్తితో నరికిన తమ్ముడు

వారధి, స్టేట్ బ్యూరో:

తమ్ముడి కుల అహంకారానికి లేడీ కానిస్టేబుల్ బలైపోయింది. కులాంతర వివాహం చేసుకుందని సొంత అక్కనే చంపేశాడు తమ్ముడు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో జరిగిన ఈ పరువు హత్య తెలంగాణలో కలకలం

..మిగతా 2 లో



## నన్ను అరెస్ట్ చేస్తే జైలుకెళతా

- అక్కడ సినిమా కథలు రాసుకుంటా
- వరుస కేసులపై అనుమానాలు
- మీడియా అత్యుత్సాహం చూపిస్తోంది
- రామ్‌గోపాల్ వర్మ సంచలన వ్యాఖ్యలు

..మిగతా 2 లో

## లారీ టైర్ల కింద బ్రతుకులు ఛిద్రం

- రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- చేవెళ్ల మండలం ఆలూరు స్టేజ్ వద్ద లారీ బీభత్సం
- కూరగాయల విక్రయదారులపైకి దూసుకెళ్లిన లారీ
- ఆరుగురు దుర్మరణం, 20 మందికి పైగా గాయాలు
- తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం



వారధి, స్టేట్ బ్యూరో:

రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చేవెళ్ల మండలం ఆలూరు స్టేజి వద్ద ఓ లారీ బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో ఆరుగురు దుర్మరణం చెందారు. హైదరాబాద్‌బీజాపూర్ రహదారి పక్కన దాదాపు 50 మంది కూరగాయలు విక్రయిస్తుండగా వారిపైకి లారీ దూసుకెళ్లడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. దూసుకొస్తున్న లారీని చూసి అక్కడి జనమంతా భయంతో పరుగులు తీశారు.వ్యాపారులపైకి దూసుకెళ్లిన లారీ చెట్టును ఢీ కొట్టి

..మిగతా 2 లో

## రేవంత్ అపరిచితుడు

- రెండు తలల పాము కంటే డేంజర్
- డబుల్ టంగ్ లీడర్లతో ప్రమాదం
- ప్రతిపక్షంలో ఒకలా.. అధికారంలో ఒకలా మాట్లాడుతున్నడు
- రాక్షసులు అన్న నోటితోనే దేవతలు అంటాడు
- మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్
- ఈ నెల 7న ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ చార్జ్‌షీట్



..మిగతా 2 లో



## ఏపీ, తెలంగాణ మధ్య తేలని పంచాయితీ

- పదేళ్లయినా కొలిక్కిరాని చర్చలు
- విభజన అంశాలపై సుదీర్ఘ చర్చ
- పెండింగ్‌లోనే ఉద్యోగుల మార్పిడి


..మిగతా 2 లో

## కేసీఆర్ మొక్క కాదు.. వేగు చుక్క

నీ గురువులకే చుక్కలు చూపించి తెలంగాణ సాధించిండు

- బీఆర్ఎస్ కార్యకర్తల జోలికొస్తే ఊరుకోం
- కేసీఆర్‌పాలనలో నిధుల వరద..
- కాంగ్రెస్ పాలనతో తిట్ల వరద
- సీఎం రేవంత్‌పై ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం
- రేపటి నుంచి జిల్లాల పర్యటన

..మిగతా 2 లో



## మాలలు సైకోలు, స్వార్థపరులు..

- అంబేడ్కర్ ను అవమానించారు
- మాలల్లో మనువాదుల సంఖ్య పెరిగింది
- అన్ని పార్టీలూ వర్గీకరణకు అనుకూలమే
- వివేక్ కాంగ్రెస్‌కి రాజీనామా చేయాలి
- వర్గీకరణను వ్యతిరేకించే పార్టీలో చేరాలి
- ఎస్సీ వర్గీకరణను అడ్డుకునే వాళ్లను ఓడిస్తాం
- రాజకీయాల్లో లేకుండా తరిమికొడతాం
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



వారధి, స్టేట్ బ్యూరో:

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయ పోరాట స్ఫూర్తిని ఈ దేశంలో ముందుకు నడిపించేది మాదిగలేనని ఎమ్మార్పీఎస్ చీఫ్ మందకృష్ణ మాదిగ

..మిగతా 2 లో




## సీఎం పీఠంపై వీడని సస్పెన్స్

- మహాయుతి భేటీ క్యాన్సిల్
- ఢిల్లీకి చేరుకున్న అజిత్ పవార్
- ఫడ్నవీస్‌కు సీఎం పదవి లేనట్టేనా..?

..మిగతా 2 లో




# మావోయిస్టులపై విషప్రయోగం..?

మొదటిపేజీ తరువాయి

హైకోర్టు.. మృతదేహాలను మంగళవారం వరకు భద్రపరచాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. మృతదేహాలను కుటుంబ సభ్యులకు, బంధువులకు చూపించాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను నేటికి వాయిదా వేసింది.

ప్రజాస్వామ్య పునరుద్ధరణ పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ సంవత్సర కాలంలో 16 మందిని ఎన్‌కౌంటర్ల పేరుతో హతమార్చిందని హక్కుల సంఘం న్యాయవాది ఆరోపించారు. కాంగ్రెస్ మళ్లీ ఎన్‌కౌంటర్ల తెలంగాణగా మార్చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కేంద్ర హోం మంత్రిని కలిసిన సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో పోలీస్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరడం ఆపరేషన్ కగార్‌ను రాష్ట్రంలో అమలు పరిచే విధంగా ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు అర్థమవుతుందని న్యాయవాది ఆరోపించారు. అడవిలో పోలీసు శోధన పేరుతో నిత్యం నిర్బంధాలను అమలు పరుస్తూ ఎన్‌కౌంటర్ల పేరుతో మావోయిస్టులను కాల్చి చంపడాన్ని పౌర హక్కుల సంఘం, రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని వెల్లడించింది. ఈ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై హత్యా నేరం నమోదు చేయాలని డిమాండ్ చేసింది.



# కానిస్టేబుల్ పరువు హత్య

మొదటిపేజీ తరువాయి

రేపుతోంది.. కులాంతర ప్రేమ వివాహం చేసుకుందని కానిస్టేబుల్ నాగమణిని తమ్ముడు పరమేష్ నరికి చంపాడు. ఈ దారుణ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో జరిగింది. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నాగమణి.. సోమవారం ఉదయాన్నే స్వగ్రామం రాయపోలు నుంచి హయత్‌నగర్ బయల్దేరింది.. ఈ క్రమంలో నాగమణి కోసం దారికాచిన తమ్ముడు పరమేష్.. ముందుగా కారుతో ఢీకొట్టి.. కత్తితో నరికి దారుణంగా చంపాడు..

హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నాగమణిని సొంత తమ్ముడే అతికిరాతకంగా నరికి చంపేశాడు. సమాచారం అందిన వెంటన పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు అక్కడ కొడవలిని సీజ్ చేశారు. కాగా.. గత నెల రోజుల క్రితమే కానిస్టేబుల్ నాగమణి కులాంతర ప్రేమ వివాహం చేసుకుంది. సోమవారం ఉదయం విధులు నిర్వర్తించేందుకు హయత్‌నగర్‌కు బయలుదేరగా.. వారి స్వగ్రామం రాయపోలు సమీపంలో హత్యకు గురైంది. నాగమణిని తమ్ముడు పరమేష్ అత్యంత దారుణంగా హత్య చేశాడు.అయితే ఆస్తి కోసమే అక్కను తమ్ముడు పరమేష్ చంపినట్లు పోలీసుల విచారణలో బయటపడింది. ప్రస్తుతం నిందతుడు పరమేష్ పోలీసుల అదుపులో ఉన్నాడు.

శ్రీకాంత్ అనే వ్యక్తితో నాగమణి ప్రేమ వివాహం జరిగింది. నవంబర్ పదో తేదీన యాదగిరిగుట్టలో ఈ జంట వివాహం చేసుకుంది. 2020 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ నాగమణి.. రాయపోల్ ప్రాంతానికి చెందిన శ్రీకాంత్‌ను వివాహం చేసుకుంది. వివాహం అనంతరం హయత్‌నగర్‌లో దంపతులు నివాసం ఉంటున్నారు. ఆదివారం సెలవు కావడంతో నాగమణి సొంత గ్రామానికి వెళ్ళింది. తిరిగి వస్తుండగా తమ్ముడి చేతిలో హత్యకు గురైంది.

# రేవంత్ అపరిచితుడు

వారధి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రెండు తలల పాము కంటే డేంజర్ అని బీఆర్‌ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మనం రెండు తలల పామును చూసి భయపడతాం... పాపం అది ఏమీ అనదు... పెద్ద ప్రమాదకరం కాదు... కానీ రెండు నాల్కల ధోరణి కలిగిన మనషులు చాలా ప్రమాదమన్నారు. కానీ అలాంటి వారిని మనం పెద్దగా పట్టించుకోమన్నారు. బీఆర్‌ఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... రెండు నాల్కల వైఖరికి నిదర్శనం నిస్సందేహంగా రేవంత్ రెడ్డే అన్నారు. రెండు వైపుల పదును కలిగిన కత్తితో కూడా జాగ్రత్తగా ఉండవచ్చు... కానీ ఈ డబుల్ టంగ్ లీడర్లతో మాత్రం చాలా ప్రమాదకరమన్నారు. సమాజానికి చాలా నష్టం చేస్తారని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎలా మాట్లాడారు... అధికారంలోకి వచ్చాక ఇప్పుడు ఎలా మాట్లాడుతున్నారో... ఆ రెండు నాల్కల ధోరణి ఏమిటో వెల్లడిస్తామన్నారు. అధికారంలోకి వచ్చాక రేవంత్ మాట తీరులో మార్పు వచ్చిందని ఆరోపించారు. ఈ నెల ఏడో తేదీన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఛార్జిషీటు వేస్తామని తెలిపారు. సీఎం అయ్యాక కూడా ఆయన మాట మార్చిన తీరును అందరూ గమనిస్తూనే ఉన్నారన్నారు. రెండు నాల్కల ధోరణిలో రేవంత్ రెడ్డి పీహెచ్‌డీ చేశారని ఎద్దేవా చేశారు. మాట మార్చడంలో, పూటకో మాట మాట్లాడడంలో రేవంత్ రెడ్డి దిట్ట అన్నారు. ఆ మాట అనలేదు... ఈ మాట అనలేదంటూ ముచ్చటగా మూడో మాట చెప్పగల నేర్పరితనం కూడా రేవంత్ రెడ్డిలో ఉందని ఎద్దేవా చేశారు. ఓ పార్టీలో ఉంటూ మరో పార్టీ అగ్రనాయకులను రాక్షసులు అంటారని, ఆ తర్వాత అదే పార్టీలో చేరి రాక్షసులు అన్న నోటితోనే దేవతలు అంటారని వ్యాఖ్యానించారు.

# త్వరలో గ్రూప్–1 నియామకాలు

వారధి, స్టేట్ బ్యూరో:

త్వరలోనే గ్రూప్1 ఉద్యోగాల నియామకపత్రాలు అందజేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ మార్గ్‌లోని హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఆరోగ్య ఉత్సవాల్లో ఆయన ప్రసంగించారు. "563 మంది గ్రూప్ 1 అధికారులను తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములను చేయబోతున్నాం. చిన్న ఆరోపణ లేకుండా టీజీపీఎస్సీ పని చేస్తోంది. దీన్ని రాజకీయ పునరావాసంగా మార్చదల్చుకోలేదు. అందుకే సీనియర్ ఐఏఎస్ బుర్రా వెంకటేశంను టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించాం" అన్నారు.

**విద్య, వైద్యమే మా ప్రాధాన్యత**

"ఏడాదిలోనే 14వేల మందిని వైద్య ఆరోగ్య శాఖలో నియమించడం ఒక చరిత్ర. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎనిమిది వైద్య కళాశాలలలు ఇచ్చి ఎలాంటి వసతులూ కల్పించలేదు. దేశంలోనే అత్యధిక డాక్టర్లను అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. గత పదేళ్ల పాలనను మీరు ప్రత్యక్షంగా చూశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత విద్య, వైద్యం. 6500 మందిని వైద్యారోగ్యశాఖలో నియమించాలని నిర్ణయించాం. బీఆర్‌ఎస్ పాలనలో బీఆర్‌ఎస్ పాలనలో ఉద్యోగ నియామకాల్లేవు. ఉద్యోగ పరీక్షలు నిర్వహించినా.. పేపర్ లీక్‌ను అరికట్టలేకపోయారు" అని సీఎం విమర్శించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. ఉద్యోగాలిచ్చాం!

"కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఉద్యోగాలు ఊడితేనే.. యువతకు ఉద్యోగాలు వచ్చాయి. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 50వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇస్తే.. పరీక్షలు షెడ్యూల్ ప్రకారం జరుగుతాయని యువత నమ్ముతోంది. పరీక్షలు వాయిదా వేస్తూ పోతే.. మీ విలువైన యుక్త వయసు వృథా అవుతుంది. మన భవిష్యత్తు 21 నుంచి 35 ఏళ్ల లోపు మీరు చేసే పనులే నిర్ణయిస్తాయి. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించిన ఉద్యోగాలు ఇచ్చాం.. ఇదీ మా చిత్తశుద్ధి. గతంలో ఆర్‌ఎంపీ డాక్టర్‌ను, తహసీల్దార్‌ను టీజీపీఎస్సీ సభ్యులుగా నియమించారు. పునరావాస కేంద్రాలుగా పబ్లిక్ సర్వీస్ కమిషన్లను మార్చేశారు. చిన్న ఉద్యోగి పెద్ద పెద్ద ఉద్యోగులను నియమించలేరుగా? పబ్లిక్ సర్వీస్ ఉద్యోగాల గురించి పూర్తి అవగాహన ఉన్న అధికారులే సక్రమంగా పరీక్షలు నిర్వహిస్తారు. జిల్లాకో మెడికల్ కళాశాల, నియోజకవర్గానికో 100 పడకల ఆస్పత్రి ఇస్తామన్నారు. . ఇవ్వలేదు.

# లారీ టైర్ల కింద బ్రతుకులు ఛిద్రం

మొదటిపేజీ తరువాయి

ఆగింది. లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో అతడిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. హైదరాబాద్‌లో అన్‌లోడ్ చేసి తిరిగి వికారాబాద్ వెళ్తున్న క్రమంలో లారీ అదుపుతప్పడంతో ఈ ఘటనకు చోటుచేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనతో హైదరాబాద్ బీజాపుర్ రహదారిపై భీతావహ వాతావరణం నెలకొంది. లారీ సృష్టించిన బీభత్సంలో మృతులను రాములు (ఆలూరు), ప్రేమ్ (ఆలూరు), సుజాత (ఖానాపూర్)గా గుర్తించారు. మరొకరు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. ఈ ఘటనలో మరికొందరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. దాదాపు వంద మీటర్ల దూరం నుంచే లారీ అదుపు తప్పిన విషయాన్ని గమనించిన కూరగాయల వ్యాపారులు పరుగులు పెట్టారు. రంగంలోకి దిగిన పోలీసులు కూలిన చెట్టును జేసీబీతో పక్కకు తొలగించారు.ఘటనా స్థలానికి కి.మీల దూరంలో ఆదివారం కూడా రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ, కారు ఢీకొని బీడీఎల్ ఉద్యోగి దంపతులు ఆదివారం దుర్మరణం చెందారు. వరుస ప్రమాదాలతో స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఈ రోడ్డును విస్తరించాలని ఏళ్ల తరబడి కోరుతున్నా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో మృతుల బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

# నన్ను అరెస్ట్ చేస్తే జైలుకెళతా

వారధి, స్టేట్ బ్యూరో:

తనను అరెస్ట్ చేస్తే జైల్లో సినిమా కథలు రాస్తానని డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ చెప్పారు. సోమవారం హైద్రాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. తనపై అరెస్ట్ వారంట్ లేదని ఆయన చెప్పారు. గతంలో సోషల్ మీడియాలో తాను చేసిన పోస్టులకు సంబంధించి రాష్ట్రంలో వేర్వేరు చోట్ల ఎఫ్ఐఆర్ లు నమోదు చేశారని ఆయన చెప్పారు. ఎప్పుడో చేసిన పోస్టులకు మనోభావాలు దెబ్బతిన్నాయని వేర్వేరు పోస్టుల్లో ఇప్పుడు కేసులు నమోదు చేయడంపైనే అనుమానాలు వ్యక్తం చేశారు. తన కేసు విషయమై మీడియా అత్యుత్సాహం చూపిందన్నారు.

తనపై నమోదైన కేసులకు సంబంధించి పోలీసులకు సమాధానం ఇచ్చినట్టుగా ఆయన తెలిపారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ కార్యక్రమాలతో పోలీసుల విచారణకు హాజరు కాలేదన్నారు. తాను హైద్రాబాద్ లోనే ఉన్నానని చెప్పానని.. మీడియా చానల్స్ కు ఇంటర్వ్యూలు కూడా ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

**చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పై పోస్టులపై కేసులు**

చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ లపై వ్యూహం సినిమా విడుదల సందర్భంగా సోషల్ మీడియాలో రామ్ గోపాల్ వర్మ పోస్టులు పెట్టారని 2024 , నవంబర్ 11న ఆయనపై ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఎం. రామలింగం ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. ఆ తర్వాత గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీస్ స్టేషన్ లో, అనకాపల్లి జిల్లా రావికమతం పోలీస్ స్టేషన్ లలో కూడా ఆయనపై కేసులు నమోదయ్యాయి.

# మాలలు సైకోలు, స్వార్థపరులు..

మొదటిపేజీ తరువాయి

అన్నారు. ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటున్న మాలలు సైకోలు, స్వార్థపరులని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. అంబేద్కర్ తన జీవిత కాలం దళితుల విముక్తి కోసం పాటుపడ్డారని వివరించారు. అయితే ఆయన లేని సమయంలో ఆయన స్ఫూర్తిని కొనసాగించాల్సిన దళిత వర్గాలు.. ఆ దళిత వర్గాల్లో ఎదిగిన మాల వర్గం ఆయన స్ఫూర్తికి భిన్నంగా.. సామాజిక న్యాయాన్ని వ్యతిరేకిస్తూ ఇవాళ ముందుకు నడుస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. సామాజిక న్యాయ పోరాటానికి అడ్డు తగిలేవారే మనువాదులు అని నాడు అంబేద్కర్ పోల్చారని గుర్తుకు చేశారు. ఎస్సీ వర్గీకరణకు అడ్డుపడేది మాలల్లో ఉండే కొందరు స్వార్థపరులు అని విమర్శించారు. ఆ స్వార్థపరులే మనువాదులు అని మండిపడ్డారు. మాలల సభలో అంబేడ్కర్ ను అవమానించారని మండిపడ్డారు. వివేక్ మాలలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ సంచలన ఆరోపణలు చేశారు.

**మాలలకు సమాజ మద్దతు లేదు..**

ఈ మేరకు ఆదివారం జరిగిన మాల మహాసభను ఉద్దేశిస్తూ మాట్లాడిన మందకృష్ణ.. ఎస్సీ వర్గీకరణకు ఇంకా అడ్డుపడతామని అంటున్న వారికి సమాజంలో ఎవ్వరి మద్దతు లేదన్నారు. అంబేద్కర్ సామాజిక న్యాయ సూత్రాన్ని ముందుకు నడిపేది మాదిగలే అన్నారు. వర్గీకరణకు అడ్డుపడుతున్న వారు మాలలలో ఉన్న కొంత మంది స్వార్థ పరులేనని చెప్పారు. అంబేద్కర్ సామజిక న్యాయ పోరాట రథాన్ని మాలలు అడ్డుకొంటున్నారని, దళితుల్లో ఉన్న మాదిగల హక్కులను మాలల హరిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్ దళితుల కోసం ఏర్పాటు చేసిన రిజర్వేషన్లు ఒక్క మాలల కోసమే కాదన్నారు. మాదిగలను చదువుకోని వారు అంటున్నారు. ఇది మాలలకు తగదు. నిన్న మాలల సభలో అంబేద్కర్ ను అవమానించారని విమర్శించారు.

**వివేక్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చెయ్..**

మా జనాభాకు తగ్గట్టు వాటా అడుగుతున్నాం. ఏ వర్గం వారికైనా జనాభాకు తగ్గట్టు ప్రాతినిధ్యం ఉండాలి. అంబేద్కర్ స్ఫూర్తి ని మాలల అడ్డుకుంటున్నారు. మా జనాభాకు తగ్గట్టు వాటా అడుగుతున్నాం. ఎస్సీ వర్గీకరణను ఏ పార్టీ ధైర్యంగా వ్యతిరేకించడం లేదు. వర్గీకరణకు వ్యతిరేకించే వారు రాజీనామా చేసి ఎన్నికలకు రావాలి.

# కేసీఆర్ మొక్క కాదు.. వేగు చుక్క

వారధి, స్టేట్ బ్యూరో:

కేసీఆర్ మొక్క కాదు వేగు చుక్క అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం నాడు ఎమ్మెల్సీ కవిత నివాసంలో కోరుట్ల నియోజకవర్గ బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జగిత్యాల జిల్లా అధ్యక్షుడు విద్యాసాగరరావు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులపై కేసులు పెట్టి వేధిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కేసీఆర్ మొక్క అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందని మండిపడ్డారు. కేసీఆర్ మొక్క కాదు పీకేయడానికి.. కేసీఆర్ ఒక వేగు చుక్క అని తెలిపారు. రేవంత్ గురువులకే చుక్కలు చూపించి తెలంగాణ సాధించిన వ్యక్తి కేసీఆర్ అని తెలిపారు. బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంలో నిధుల వరద పారేదని.. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో తిట్ల వరద పారుతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి, మంత్రులు అదే పనిగా తిట్ల పరిపాలన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రేపటి నుంచి తాను జిల్లాల్లో పర్యటిస్తానని బీఆర్‌ఎస్ శ్రేణులు అండగా ఉంటానని అధైర్యపడవద్దని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతామని అన్నారు. డిసెంబర్ 4నుంచి 8వ తేదీ వరకు పలు జిల్లాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ జాగృతి ఉమ్మడి జిల్లాల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కవిత అధ్యక్షతన ఈ సమావేశాలు జరగనున్నాయి. ఈ మేరకు ఓ షెడ్యూల్‌ను ప్రకటించారు. డిసెంబర్ 4వ తేదీన వరంగల్ నిజామాబాద్, డిసెంబర్ 5న కరీంనగర్ నల్గొండ, డిసెంబర్ 6న రంగారెడ్డి ఆదిలాబాద్, డిసెంబర్ 7న హైదరాబాద్ ఖమ్మం, డిసెంబర్ 8న మెదక్ మహబూబ్‌నగర్ ల్లో కవిత పర్యటనలు ఉండనున్నాయి.

# ఏపీ, తెలంగాణ మధ్య తేలని పంచాయితీ

వారధి, స్టేట్ బ్యూరో:

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల పునర్విభజన అంశాలపై సోమవారం అమరావతిలో రెండు రాష్ట్రాల సీఎస్‌లు, అధికారులుక కీలక భేటి నిర్వహించారు. దాదాపు రెండు గంటలపాటు జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చ జరిగింది. రెండు రాష్ట్రాల విడిపోయిన తర్వాత పెండింగ్‌లో ఉన్న విషయాలపై ఇరు రాష్ట్రాల అధికారుల సుధీర్ఘంగా చర్చించారు. అయినా సరే కొన్ని విషయాల్లో క్లారిటీ రాకపోవడం విశేషం.

రూ.861 కోట్ల లేబర్ సెస్‌ను రెండు రాష్ట్రాల మధ్య పంచుకునేందుకు అంగీకారం కుదిరింది. పన్నుల పంపకంపై ఇరు రాష్ట్రాల శాఖల అధికారులు భవిష్యత్తులో మరోసారి సమావేశమై నిర్ణయం తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. రెండు గంటల పాటు చర్చించుకున్నా సరే.. విద్యుత్ బకాయిల అంశంపై ఎటువంటి నిర్ణయానికి రాలేకపోయారు. 9, 10 షెడ్యూల్ సంస్థల ఆస్తులు, అప్పుల అంశంపై కూడా ఇరు రాష్ట్రాలు ఓ కొలిక్కి రాలేకపోయాయి.

తెలంగాణ ఎక్సైజ్ శాఖకు అదనంగా చెల్లించిన రూ.81 కోట్లను ఏపీ తిరిగి చెల్లించినట్లు ప్రకటించింది. ఈ అంశం ముగిసినట్లైంది. రాష్ట్రాల్లో డ్రగ్స్ నియంత్రణ కోసం పోలీసులు, ఎక్సైజ్ అధికారులతో కూడిన సంయుక్త కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఉద్యోగుల విభజనపై సుదీర్ఘంగా చర్చ జరిగినప్పటికీ ఈ అంశంపై ఎటువంటి తుది నిర్ణయం తీసుకోలేదు. విభజన అంశాలపై ఇంకా పెండింగ్‌లో ఉన్న విషయాలను చర్చించేందుకు మరోసారి సమావేశం ఏర్పాటు చేయాలని సీఎస్‌లు నిర్ణయించారు. సమావేశంలో కొన్ని అంశాలపై నిర్ణయాలు వచ్చినా, విద్యుత్ బకాయిలు, షెడ్యూల్ సంస్థల ఆస్తులు, ఉద్యోగుల మార్పిడి వంటి కీలక అంశాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. వీటిపై స్పష్టత రావడానికి త్వరలోనే మళ్లీ సమావేశాలు జరగనున్నాయి.

# సీఎం పీఠంపై వీడని సస్పెన్స్

వారధి, నేషనల్ బ్యూరో:

మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఎవరన్న ఉత్కంఠకు సోమవారం కూడా తెరపడే అవకాశం కనిపించడం లేదు. సోమవారం జరగాల్సిన కీలక సమావేశం రద్దయిందని తెలుస్తోంది. మహారాష్ట్ర పరిస్థితులను పర్యవేక్షించడానికి గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ, ఆర్థిక మంత్రి సీతారామన్‌ను బీజేపీ కేంద్ర పరిశీలకులుగా నియమించింది. 132 మంది ఎమ్మెల్యేలతో వీరిద్దరు చర్చలు జరపనున్నారు. అనంతరం శాసనసభాపక్షనేత ఎంపికపై నిర్ణయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లనున్నారు.అయితే గొంతు ఇన్ఫెక్షన్ కారణంగా మహారాష్ట్ర ఆపద్ధర్మ ముఖ్యమంత్రి, శివసేన అధినేత ఏక్‌నాథ్ శిందే సోమవారం అన్ని సమావేశాలను రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది. కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందేకు బీజేపీ నేత దేవేంద్ర ఫడణవీస్ ఫోన్ చేసి పరామర్శించినట్లు సమాచారం. అటు ఎన్‌సీపీ చీఫ్ అజిత్‌పవార్ బీజేపీ అగ్రనాయకత్వంతో భేటీ అయ్యేందుకు దిల్లీ వెళ్లారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం అగ్రనేతలతో సమావేశం కానున్నారు. పోర్టుఫోలియోలపై ప్రధానంగా చర్చలు జరగనున్నట్లు సమాచారం

మరోవైపు, డిసెంబరు 4న మహారాష్ట్ర కొత్త సీఎం పేరును మహాయుతి కూటమి ప్రకటించనుందని బీజేపీ సీనియర్ నేత ఒకరు తెలిపారు. ఆరోజే బీజేపీ శాసనసభాపక్ష సమావేశం ఉదయం 10 గంటలకు జరగనందని వెల్లడించారు. డిసెంబర్ 5న ముంబయిలోని ఆజాద్ మైదాన్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, ఇతర నేతల సమక్షంలో కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేస్తారని బీజేపీ ఇప్పటికే ప్రకటించింది. అధికారికంగా ఎలాంటి ప్రకటన రానప్పటికీ, సీఎం పదవికి దేవేంద్ర ఫడణవీస్ పేరు ఖరారు చేసినట్లు బీజేపీ సీనియర్ నేత ఒకరు ఆదివారం ప్రకటించారు.






## భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఐఏఎల్ లో సముచిత స్థానం

- తెలంగాణ రాష్ట్ర ఐ ఏ ఎల్ ప్రధాన కార్యదర్శిగా ఎలమోలు ఉదయభాస్కరరావు ఎన్నిక
- ఎన్నిక పట్ల పలువురు హర్షం

**వారధి న్యూస్/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఐఏఎల్ ప్రధాన కార్యదర్శిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఎలమోలు ఉదయ భాస్కర్ రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హనుమకొండ జిల్లాలో జరిగిన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏ ఎల్ )రెండవ రాష్ట్ర మహాసభల్లో సూర్యాపేట జిల్లాకు చెందిన బొమ్మ గాని ప్రభాకర్ అధ్యక్షుడిగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఎలమోలు ఉదయ భాస్కరరావు ప్రధాన కార్యదర్శి గాను, భాగం మాధవరావు సహాయ కార్యదర్శిగా, మునిగడప వెంకటేశ్వర్లు, ఉప్పు శెట్టి సునీల్ లను రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 3 ఉపాధ్యక్షులు, ఇద్దరు సహాయ కార్యదర్శులు, 12 మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎలమోలు ఉదయ్ భాస్కరరావు విద్యార్థి దశ నుండే కమ్యూనిజం భావాలతో విద్యార్థి ఉద్యమాలపై అనేక పోరాటాలు చేశారని న్యాయవాద పట్ట పొందిన అనంతరం ప్రస్తుత శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు సహచరుడిగా కొత్తగూడెంలో అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారు. 1980 నుండి కొత్తగూడెం కోర్టులో 44 సంవత్సరాల నుండి న్యాయవాద వృత్తిని చేపట్టి వేలాదిమంది పేద మధ్యతరగతి పార్టీ కార్యకర్తలకు న్యాయాన్ని అందించి ప్రజల ఆధారాభిమానాన్ని చురగొన్నారని వారు తెలిపారు. వీరి ఎన్నిక పట్ల స్థానిక శాసనసభ్యులు కూనంనేని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, భద్రాద్రి జిల్లా న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి ఐఏఎల్ లో నలుగురికి స్థానం కల్పించడం పట్ల సోమవారం కొత్తగూడెం కోర్టులో హర్షం వ్యక్తం చేశారు.




## దివ్యాంగుని పై దాడి

- స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన బాధితుడు

వారధి న్యూస్ మహబూబ్ నగర్,

మండల పరిధిలోని ఓ ప్రజా ప్రతినిధి దివ్యంగునిపై దాడికి పాల్పడ్డాడని బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం నంది పహాడ్ గ్రామ పంచాయతీలో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దివ్యాంగుడైన గుర్రాల నరేష్ తండ్రి అంజిలప్ప పై అదే గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి దాడి ఘటనపై దివ్యాంగుల హక్కుల జాతీయ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షురాలు రాధిక తీవ్రంగా ఖండించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 100% కళ్ళు కనిపించని దివ్యగుడైన నరేష్ పై ఇంత దారుణంగా దాడి చేయడం సభబు కాదని ఈ దారుణానికి పాల్పడిన మాజీ ప్రజా ప్రతినిధి, ప్రజ సమస్యలను పరిష్కరించే బాధ్యత కలిగిన ఎంపీటీసీ గా పనిచేసిన వ్యక్తే ఇలాంటి దారుణానికి పాల్పడటం సిగ్గుచేటని మండిపడ్డారు. కావున అధికారులు వెంటనే స్పందించి కేసు నమోదు చేసి బాధితుడికి నాయ్యం చేకూరేలా చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. లేనియెడల వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో పోరాటం చేస్తామని ఆమె హెచ్చరించారు.



## ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ బేన్ షా

వారధి న్యూస్ మహబూబ్ నగర్,

ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యతనిచ్చి సత్వరమే వాటిని పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బేన్ షాలమ్ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టరేట్ లోని ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ గరిమా నరులతో కలిసి అదనపు కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. సోమవారం నాటి ప్రజావాణికి 20 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ రకాలైన ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ల కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్. డి. ఓ. రాంచందర్, కలెక్టరేట్ ఎ. ఓ.జయసుధ, అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# తిరుగులేని వీరులు దివ్యాంగులు




అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ప్రతి సంవత్సరం డిసెంబరు 3వ తేదీన ప్రపంచవ్యాప్తంగా నిర్వహించబడుతుంది. రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరంగా దివ్యంగుల ఎదుగుదలను ప్రోత్సహించేందుకు ఈ రోజును ఏర్పాటుచేయడమైంది. దివ్యాంగులకు సమాన అవకాశాలు, హక్కులు కలిపించి వారందరిని సమాజ అభివృద్ధిలో భాగం చేయాలనే లక్ష్యంతో 1976లో ఐక్యరాజ్య సమితి 1981 సంవత్సరాన్ని అంతర్జాతీయ దివ్యాంగుల సంవత్సరంగా ప్రకటించింది. 1983 నుండి 1992 వరకు ఐక్యరాజ్య సమితి దివ్యాంగుల దశాబ్దంగా ప్రకటించింది.

**సమ్మిళిత, సుస్థిర భవిష్యత్తు:**
ఈ ఏడాది థీమ్ "సమ్మిళిత, సుస్థిర భవిష్యత్తు కోసం దివ్యాంగుల నాయకత్వాన్ని పెంపొందించడం."ప్రపంచ ఆరోగ్య లక్ష్యాలను సాధించడంలో అందరికీ ఆరోగ్య సమానత్వాన్ని ముందుకు తీసుకెళ్లడంలో మరింత సమ్మిళిత, సుస్థిర భవిష్యత్తును నిర్మించడంలో అర్థవంతమైన పురోగతి సాధించడానికి దివ్యాంగుల నాయకత్వాన్ని పెంచడం చాలా అవసరమని డబ్ల్యూహెచ్ఓ గుర్తించింది. అందరిలాగే వీరికి అత్యున్నత స్థాయి ఆరోగ్యాన్ని సాధించే హక్కు ఉంది. ఇది ప్రాథమిక మానవ హక్కు. వీరు తమ జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాలలో పూర్తిగా, సమర్థవంతంగా పాల్గొనే హక్కును కలిగి ఉంటారు.

**వివక్షతకు గురవుతూనే ఉన్నారు:**
ఎంత అభివృద్ధి జరుగుతున్నా ప్రపంచంలో వీరు ఆరోగ్యం, విద్య, ఉపాధి వంటి చాలా రంగాలలో వివక్షకు గురవుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 13 కోట్ల మంది గణనీయమైన వైకల్యాన్ని అనుభవిస్తున్నారని అంచనా. ఇది ప్రపంచ జనాభాలో 16% లేదా ఆరుగురిలో ఒకరిని సూచిస్తుంది. వైకల్యాలున్న వ్యక్తులు డిప్రెషన్, ఆస్తమా, డయాబెటిస్, స్ట్రోక్, ఊబకాయం సమస్యలు ప్రమాదం రెండింతలు ఎక్కువగా ఉంటుంది. ఈ సంఖ్య గత దశాబ్దంలో పెరిగింది. జనాభా, ఎపిడెమియోలాజికల్ మార్పుల కారణంగా పెరుగుతూనే ఉంది. 2022 లో ప్రపంచ ఆరోగ్య సంస్థ దివ్యాంగుల ఆరోగ్య సమానత్వంపై గ్లోబల్ నివేదికను ప్రారంభించింది. ఇప్పటికీ చాలా మంది వెనుకబడి ఉన్నారని ఈ నివేదిక రుజువు చేసింది. నిరంతర ఆరోగ్య అసమానతలను అనుభవిస్తూ ముందుగానే మరణిస్తారు. వారి సాధారణ జనాభా కంటే ఆరోగ్య అత్యవసర పరిస్థితుల వల్ల ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ విధానం ద్వారా దివ్యాంగులకు ఆరోగ్య రంగాన్ని మరింత సమ్మిళితం చేయడానికి చర్యలు తీసుకోవాలని సభ్య దేశాలకు గ్లోబల్ రిపోర్ట్ పిలుపునిచ్చింది. ఆరోగ్య కవరేజీని నిజంగా విశ్వవ్యాప్తం చేయడానికి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో ఇతర ఆరోగ్య సంబంధిత లక్ష్యాల వైపు పురోగమించడానికి దేశాలకు ఇది చాలా అవసరం. నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలలో వీరి భాగస్వామ్యాన్ని పెంచడం, జీవితంలోని అన్ని రంగాలలో వారి నాయకత్వాన్ని ప్రోత్సహించడం ద్వారా సమాజంలోని అన్ని అంశాలలో వారిని చేర్చడానికి దోహదపడుతుంది.

**మనదేశంలో గణాంకాలు:**
2011 జనాభా లెక్కల ప్రకారం మనదేశంలో 2.68 కోట్ల మంది లేదా జనాభాలో 2.21% గా ఉన్నారు. వీరిలో 1.49 కోట్ల మంది పురుషులు, 1.19 కోట్ల మంది మహిళలు ఉన్నారు. వీరిలో గ్రామీణ ప్రాంతంలో 18.1%, పట్టణ ప్రాంతంలో 8.1% ఉన్నారు.

**భారత దేశంలో ప్రముఖులు :**

**సుధా చంద్రన్:**
కేరళలో జన్మించిన ఈమె16 ఏళ్ల వయసులో ప్రమాదానికి గురైంది. ఆమె కృత్రిమ"జైపూర్ ఫుట్"తో చాలా సాధనతో దేశంలో అత్యంత ప్రాచుర్యం పొందిన శాస్త్రీయ నృత్యకారులలో ఒకరిగా మారారు. అంతర్జాతీయంగా భరతనాట్యాన్ని ప్రదర్శించిన ఈమె భారతీయ టెలివిజన్ చలనచిత్ర పరిశ్రమలో కూడా సుపరిచితమైన వ్యక్తి. తన అద్భుతమైన ప్రతిభకు ఎన్నో అవార్డులు అందుకున్న చంద్రన్ ఎందరికో స్ఫూర్తి!

**రవీంద్ర జైన్:**
దృష్టి లోపంతో జన్మించిన జైన్ చాలా చిన్న వయస్సులోనే పాడటం ప్రారంభించారు. 1970 లలో అత్యంత ప్రసిద్ధ సంగీత దర్శకులలో ఒకరిగా మారారు. హిందీ సినిమాలకు వివిధ 'సూపర్ హిట్' పాటలను కంపోజ్ చేయడమే కాకుండా అనేక ప్రైవేట్ ఆల్బమ్లను కూడా విడుదల చేశారు.

**గిరీష్ శర్మ:**
చిన్నప్పుడే రైలు ప్రమాదంలో కాలు కోల్పోయిన ఆయన బ్యాడ్మింటన్ ఛాంపియన్ అయ్యారు.

**శేఖర్ నాయక్:**
వైకల్యాన్ని అవకాశంగా మార్చుకున్న వ్యక్తికి నాయక్ సరైన ఉదాహరణ. తన దృఢ సంకల్పం, అంకితభావంతో టీ20 అంధుల క్రికెట్ ప్రపంచ చాంపియన్ గా నిలిచి 32 శతకాలు సాధించాడు.

**సతేంద్ర సింగ్:**
ఈ ప్రఖ్యాత వైద్యుడు కేవలం తొమ్మిది నెలల వయస్సులోనే పోలియో బారిన పడ్డారు. ప్రముఖ వికలాంగుల కార్యకర్త అయిన ఆయన వికలాంగులకు బహిరంగ ప్రదేశాలను మరింత అందుబాటులోకి తీసుకురావడానికి విస్తృతంగా కృషి చేస్తున్నారు.

**హెచ్.బోని ప్రభు:**
నాలుగేళ్ళ వయసులోనే నడుము పంక్చర్ అయ్యింది. అతని అపారమైన కృషి మరియు అంకితభావం అతన్ని గుర్తించదగిన వ్యక్తిగా మరియు ప్రముఖ క్వాడ్రిప్లెజిక్ వీల్ చైర్ టెన్నిస్ ఆటగాడిగా చేసింది. 1998 ప్రపంచ ఛాంపియన్షిప్లో పతకం సాధించిన ఆయనను 2014లో భారత ప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించింది.

**సాయి ప్రసాద్ విశ్వనాథన్:**
చిన్నతనంలోనే శరీరం కింది భాగంలో స్పర్శను కోల్పోయాడు.
14,000 అడుగుల ఎత్తు నుంచి స్కైడైవింగ్ చేసిన తొలి భారతీయుడిగా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో తన పేరును నమోదు చేసుకున్నాడు.

**అరుణిమా సిన్హా:**
కదులుతున్న రైలు నుంచి కొందరు ఆమెను తోసేయడంతో కాలు కోల్పోయారు. ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన తొలి దివ్యాంగురాలిగా రికార్డు సృష్టించారు.

**రాజేంద్ర సింగ్ రహేలు:**
ఎనిమిది నెలల వయసులో పోలియో సోకింది. కామన్వెల్త్ గేమ్స్ 2014లో పవర్ లిఫ్టింగ్ లో రజత పతకం సాధించి చరిత్ర సృష్టించాడు.

**2024 పారాఒలింపిక్స్:**
2024 పారాఒలింపిక్ చరిత్రలో అత్యంత విజయవంతమైన ప్రదర్శనను సాధించిన మనదేశం ఏడు స్వర్ణాలు, తొమ్మిది రజతాలు, పదమూడు కాంస్యాలతో మొత్తం ఇరవై తొమ్మిది పతకాలు సాధించింది. టోక్యో 2020లో ఐదు స్వర్ణాలతో సహా 19 పతకాల రికార్డును అధిగమించింది.

**వీరే స్వర్ణాలు:**
అవని లేఖా షూటింగ్లో, నితేష్ కుమార్ బ్యాడ్మింటన్లో, సుమిత్ జావెలిన్ త్రోలో, హర్విందర్ సింగ్ విలువిద్య లో, పురుషుల క్లబ్ త్రో లో, ప్రవీణ్ కుమార్ పురుషుల హైజంప్లో, నవదీప్ సింగ్ పురుషుల జావెలిన్ త్రో లో బంగారు పతకాలు సాధించారు.



జనక మోహన రావు దుంగ
ఫోన్ 8247045230



## రామగుండం లో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రారంభించిన ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్.....

వారధి న్యూస్ , గోదావరిఖని :

గోదావరిఖని పట్టణంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్ సోమవారం రోజున ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను శిలాఫలకాన్ని ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించడం జరిగింది . నియోజకవర్గంలో ఉన్న హిజ్రాలను దృష్టిలో ఉంచుకొని మైత్రి ట్రాన్స్ క్లినిక్ సమగ్ర వైద్యం, సమాన గౌరవం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యం అని ప్రత్యేక వైద్య విభాగాన్ని ప్రారంభించడం జరిగింది. జరిగినది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ మాట్లాడుతూ... గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యపుపాలనలో అసంపూర్తిగా వదిలేసిన మెడికల్ కాలేజీ పూర్తిస్థాయి నిర్మాణానికి, కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నేటితో గడీల పాలనకు తెరపడి ప్రజాపాలన సంవత్సర కాలం పూర్తయిన సందర్భంగా,రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో పూర్తిస్థాయిలో మెడికల్ హబ్ గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందజేయనున్నదని, తప్పకుండా రామగుండంలో నాణ్యమైన వైద్యం ప్రతి నిరుపేదకు అందే విధంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని, తల్లి జన్మనిస్తే వైద్యుడు జీవం పోస్తున్నాడని, వైద్యుడు దైవంతో సమానమని దేవుడి తర్వాత అంతలా రెండు చేతులెత్తి మొక్కే ప్రతిరూపం వైద్యుడు అని, ఇక్కడున్న విద్యార్థులంతా మదర్ తెరిసాను ఆదర్శవంతంగా తీసుకొని ఉన్నతమైన వైద్యులుగా అవతరించాలని, ప్రతి ఒక్కరూ తమ గమ్యస్థానానికి చేరుకోవాలని, సమాజంలో వైద్యులకు వైద్య రంగానికి ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్ మాట్లాడం జరిగింది. ఈ కార్యక్రమంలో హాస్పిటల్, మెడికల్ కాలేజ్ సూపరిండెంట్, తో పాటు ప్రముఖ వైద్య నిపుణులు, రామగుండం కార్పొరేషన్ మేయర్ బండి అనిల్ కుమార్, కార్పొరేటర్లు,ఆయా విభాగాల అధ్యక్షులు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అగ్గి పుల్లలు కొన్ని..సిగ్గు బిల్లలు కొన్ని..

ఎన్ని రంగులో..ఎన్ని హంగులో..
ఎంత సౌరభమో..ఎంత సౌందర్యమో..
ఆత్మీయ ఆలింగనాలు కోన్ని
ఆశీస్సుల ఉషస్సులు కోన్ని
మైత్రి మమకారాలు కోన్ని
అన్నీ ఆనందాలే..అన్నీ అపురూపాలే
తడుము కుంటూ పోతే..
అంతరంగాలన్నీ..
వ్యధార్తి జీవిత యధార్థ దృశ్యాలే
ఆవేశాల ఆవేదనలు కోన్ని
అగ్ని పర్వతాల భగ భగలు కొన్ని
నిశ్శబ్దాలు కొన్ని..నిట్టూర్పులు కొన్ని
అన్నీ అక్షరాలే..అన్నీ ఆయుధాలే

మధిస్తూ పోతే..
మస్తిష్కాలన్నీ..మహాప్రస్తానాలే
అగ్గి పుల్లలు కొన్ని..సిగ్గుబిల్లలు కొన్ని
సముద్రాలు కొన్ని..సాహసాలు కొన్ని
ఎదురీతలు కొన్ని..ఎడతెగనివి కొన్ని
అన్నీ మేదస్సులే..అన్నీ తపస్సులే

నిలువరిస్తూ పోతే..
నిలువెల్లా గాయాలే
త్యాగాలన్ని తలరాతలే
కొన్ని తీపిగుర్తులు..కొన్ని చేదు మాత్రలు
కొన్ని కుచ్చితాలు..కొన్ని కుతంత్రాలు
అన్నీ "రాజీ"నామాలే..అన్నీ "వీలు" నామాలే

వింటూపోతే..అంతా లోకువే..
కొన్ని అశాస్త్రీయాలు..కొన్ని అసందర్భాలు
వాగ్ధానపు వర్షాలు కొన్ని..
అన్నీ అజ్ఞానాలే..అన్నీ అస్పష్టాలే..

భరిస్తూ పోతే..
బతుకంతా బానిసత్వమే..
కొన్ని నినాదాలు..కోన్ని నిరసనలు
కొన్నీ జలదరింపులు..కొన్ని చీదరింపులు..
కొన్ని దారుణాలు..కొన్ని రణాలు
అన్నీ ఒరి తీర్పులే..అన్నీ ఓదార్పులే..

రాసుకుంటూ పోతే..
అక్షరానికీ అక్షరానికీ
కొత్త ఒరిపిడే..కొత్త ఒరవడే
అంతర్వేదాలు కొన్ని..అంతర్మధనాలు కొన్ని
అన్నీ అమూల్యాలే..అన్నీఆణిముత్యాలే..!



డా.కటుకోర్భ్వల రమేష్
సెల్:9949083327

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com
GENERAL NEWS
జనరల్ న్యూస్

# బంగ్లాదేశ్ హిందువులకు మద్దతుగా జగిత్యాల లో ఈ నెల 4 న నిరసన ర్యాలీ

వారధి న్యూస్ , జగిత్యాల ప్రతినిధి



బంగ్లాదేశ్ లో హిందువులపై రోజురోజుకు పెరుగుతున్న దాడులను నిరసిస్తూ ఈ నెల 4 న హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలో వివిధ హిందూ సంస్థల ఆధ్వర్యంలో శాంతియుత నిరసన ర్యాలీని నిర్వహిస్తున్నామని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు బోయిని పద్మాకర్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో బంగ్లాదేశ్ లో మైనార్టీ హిందువులపై జరుగుతున్న ఘోర అత్యాచారాలు,దమనకాండలు,హత్యాకాండలు ,నిరంతర దాడులు యావత్ హిందూ సమాజాన్ని కలవరపెడుతున్నాయన్నారు. బంగ్లాదేశ్ లో ప్రభుత్వం మారినప్పటి నుండి ఈ దాడులు మరింత ఉధృతం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.హిందూ రహిత బంగ్లాదేశ్ గా మార్చే కుట్రలో భాగంగా ఈ దాడులు జరుగుతున్నాయన్నారు. బంగ్లాదేశ్ లో హిందువులకు జరుగుతున్న అన్యాయంపై దేశంలోని ఏ ఒక్క రాజకీయ పార్టీ నాయకుడు కూడా మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకొని బంగ్లాదేశ్ లో హిందువుల రక్షణకు తగిన చర్యలు తీసుకోవడం తో పాటు ఆదేశంపై అంతర్జాతీయంగా ఒత్తిడి పెంచాలని కోరారు. యావత్ హిందూ సమాజం బంగ్లాదేశ్ లోని హిందువులకు తమ మద్దతు ఇవ్వాలని కోరారు. హిందూ సమాజం ఐక్యంగా నిరసన గళాలను విప్పి సంఘటిత శక్తిని చాటాల్సిన అవసరం ఉందన్నారు. డిసెంబర్ 4, బుధవారం ఉదయం 10.30గంటలకు స్థానిక టౌన్ హాల్ నుండి తహసిల్ చౌరస్తా,పాత బస్టాండ్, టవర్, కొత్త బస్టాండ్ వరకు నిరసన ర్యాలి నిర్వహిస్తున్నామని,ఈ నిరసన ర్యాలీలో ప్రతి హిందువు తప్పకుండా అధిక సంఖ్యలో పాల్గొని ఐక్యతను చాటుతూ బంగ్లాదేశ్ లోని హిందువులకు అండగా నిలవాలని కోరారు.





# ఇల్లందులో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విస్తృత పర్యటన

వారధి న్యూస్/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:

ఇల్లందు నియోజకవర్గ టేకులపల్లి మండలంలో సోమవారం రాష్ట్ర రెవిన్యూ హౌసింగ్ సమాచారం పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనుకయ్య, జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ఐటీడీఏ పీవో రాహుల్ తో కలసి విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా మొత్తం 15.38 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టానున్న పలు బిటీ రోడ్ల పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టారు. మొదటగా సింగ్య తండా నుండి గొల్లగూడెం వెళ్ళు 2.2 కిలోమీటర్ల రహదారి, ఎర్రాయి గూడెం గ్రామం నుండి చింతలకట్ట గ్రామం వరకు రహదారి, దాసు తండా నుండి ఎర్రబోడు వరకు 3.8 కి.మీ రహదారి పనులకు, బొడ్డుగూడెం పంచాయతీ రోడ్డు నుండి బంగారంపల్లి వయా బర్లగూడెం వరకు నాలుగు కిలోమీటర్లరహదారి, పెద్ద చర్లపల్లి గ్రామం వరకు గంగారం నుండి ఉలవచిలక గ్రామం వరకు నిర్మించనున్న ఎస్ టి ఎస్ టి ఎఫ్ నిధులు 15.38 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రి పోగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ శంకుస్థాపన చేసిన రోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. కాంట్రాక్టర్లు రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యత పాటించాలన్నారు. రానున్న పది రోజుల్లో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కార్యక్రమం చేపడతామన్నారు. అర్హులైన పేదవారి అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. దీనిలో భాగంగా మొదటి విడతగా స్థలం ఉండి ఇంటి నిర్మాణానికి ఆర్థిక స్తోమత లేని పేదవారికి ఇంటి నిర్మాణం కోసం 5 లక్షల రూపాయలు మంజూరు చేస్తామన్నారు. టేకులపల్లి మండలం గంగారం గ్రామంలో వున్న ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహాన్నిమంత్రి ఆకస్మికంగా తనిఖీలో భాగంగా మంత్రి వసతి గృహంలో వంటశాలను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం కల్పిస్తున్నారా లేదా అని అడిగారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని హెడ్ మాస్టర్ ను ఆదేశించారు. వసతి గృహంలో పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులకు బెడ్లు ఉన్నాయా వారికి చదువుకోవడానికి అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం వివిధ సమస్యల పరిష్కారానికై ప్రజలు తెచ్చిన దరఖాస్తులను మంత్రి స్వీకరించి దరఖాస్తుల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా టేకులపల్లి తాసిల్దారు భవానిని ఆదేశించారు.

ఈ పర్యటనలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాలశ్రీనివాస్, కొత్తగూడెం ఆర్డీవో మధు, ఆర్ అండ్ బి ఈ ఈ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య శాఖ అధికారి భాస్కర్ నాయక్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి లెనినా, మిషన్ భగీరథ ఈ ఈ తిరుమలేష్, నళిని, జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ కురుమూర్తి స్వామి హుండి లెక్కింపు

వారధి న్యూస్ మహబూబ్ నగర్,

పేదల తిరుపతిగా విరజిల్లుతున్న శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు ముగిసినప్పటికీ జాతర కొనసాగుతుంది భక్తులు స్వామివారిని దర్శించుకుని ఉండిలవేసిన కానుకలను సోమవారం మూడవసారి హుండీ లెక్కించగా31.35.111.రూపాయలు వచ్చినట్లు ఈవో మదనేశ్వర్ రెడ్డి చైర్మన్ గోవర్ధన్ రెడ్డి ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు మొదటిసారి ఉండే లెక్కించగా 25.54.805రూ. వచ్చినట్లు తెలిపారు రెండవసారి హుండీ లెక్కింపు చేయగా 22.78.896రూ. వచ్చిందన్నారు 2024 సంవత్సరంలో దేవస్థానానికి వచ్చిన ఆదాయం79.68.812రూ. వచ్చినట్లు తెలిపారు 2023లో దేవస్థానానికి వచ్చిన ఆదాయం 66.5.173రూ. వచ్చిందని గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం13.63.639. రూ అధికంగా దేవాలయానికి ఆదాయం వచ్చిందని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు భక్తులు పాల్గొన్నారు





# రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నూతన జిల్లా కార్యవర్గం ఎన్నిక

వారధి న్యూస్/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:

అన్ని ఉపాధ్యాయ సంఘాలకు మాతృ సంఘంగా గుర్తింపు పొందిన రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్.టి.యు, టిఎస్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నూతన కార్యవర్గాన్ని సోమవారం కొత్తగూడెంలోని శేషగిరి భవన్లో నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా బి.మంగీలాల్ (సుజాత నగర్ మండలం), ప్రధాన కార్యదర్శిగా ఎండీ.లాల్ అహ్మద్ (పాల్వంచ మండలం) లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**జిల్లా నూతన కార్యవర్గం వివరాలు**

జిల్లా గౌరవ అధ్యక్షుడిగా బి.చందర్ (లక్ష్మీదేవిపల్లి మండలం), గౌరవ సలహాదారుడిగా కే.సుధాకర్ (పాల్వంచ మండలం) ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులుగా ఎం.జ్యోతిరాణి (టేకులపల్లి మండలం), ఏ.మోహన్ (లక్ష్మీదేవిపల్లి మండలం), బి.భోజ్యాలాల్ (చర్ల మండలం)లు ఎంపికయ్యారు. అదనపు ప్రధాన కార్యదర్శులుగా జీ.శంకర్, బీ.గోపాల్ (జులూరుపాడు మండలం), ఉపాధ్యక్షులుగా బి.శ్రీను (జులూరుపాడు మండలం), ఎస్.లక్ష్మయ్య (దమ్మపేట మండలం), బీ.వెంకట్ (జులూరుపాడు మండలం), కార్యదర్శులుగా ఎం .సత్యనారాయణ (దమ్మపేట మండలం), బి.రాజువల్ (బూర్గంపాడు మండలం), మహిళా కార్యదర్శిగా ఐ.దీనమ్మ (పాల్వంచ మండలం), కోశాధికారిగా బి.సుబ్బారావు (కొత్తగూడెం మండలం)లు ఎన్నికయ్యారు.

**జిల్లా కౌన్సిల్ లో చేసిన తీర్మానాలు :**

1. నూతన పీఆర్సీ ని తక్షణమే ప్రకటించి గత పీఆర్సీ ఎరియర్స్ ను ఒకే సారి చెల్లించాలి.
2. పెండింగ్ డిఎలను తక్షణం విడుదల చేయాలి.
3. జిపిఎఫ్ ను టీఎస్ జి ఎల్ ఐ సిలను ఎలాంటి జాప్యం లేకుండా చెల్లించాలి.
4. వివిధ రూపాల్లో ఉత్పన్నమయ్యే ఖాళీలను సీనియార్టీ ప్రకారం పని చేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులతో భర్తీ చేయాలి.
5. రిటైర్ అయిన ఉపాధ్యాయులందరికీ బెనిఫిట్స్ ను తక్షణమే అందజేయాలి.
6. 317 జీవో ద్వారా ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి.
7. స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలి.
8. ఉపాధ్యాయులపై ఎలాంటి కక్ష్యసాధింపు చర్యలు లేకుండా ఉండాలని సూచన.
9. ఎస్ జి టి లకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలి.
10. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఎస్ఎస్ సి స్పాట్ వాల్యుషన్ సెంటర్ ఏర్పాటు చేయాలి.
11. సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలి.



# కార్మికుల సంక్షేమానికి అధికారులు కృషి చేయాలి

**వార్డు కౌన్సిలర్ వై.శ్రీనివాస్ రెడ్డి**

వారధి న్యూస్/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:

కొత్తగూడెం మున్సిపల్ పరిధిలోని 23వ వార్డు కూలీ లైన్ లో మున్సిపాలిటీ ద్వారా మంజూరైన యూనిఫామ్ దుస్తులను సోమవారం వార్డు కౌన్సిలర్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ వై.శ్రీనివాస్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రొద్దున లేస్తే కాలవల్లో చెత్తాచెదారం మురుగును తొలగిస్తూ రోడ్లను ఊడుస్తూ దుబ్బ దూళి మింగుతూ అనారోగ్యాలు పాలవుతున్నడని దృష్టిలో పెట్టుకొని మున్సిపాలిటీ యాజమాన్యం వారి సంక్షేమానికి కృషి చేయాలి అన్నారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేసిన పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులకు ఇంకా రావలసిన పెండింగులో ఉన్న చెప్పులు కొబ్బరి నూనె సబ్బులు గ్లౌజులు మాస్కులు తదితర రక్షణ సామాగ్రిని తక్షణమే కార్మికులకు అందించాలని సూచించారు. హెల్త్ చెకప్ కూడా చేపించి వారి ఆరోగ్యాలను కాపాడాలని మున్సిపల్ కమిషనర్ కు మున్సిపల్ అధికారులకు కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు.



# మార్కండేయ ఆలయ పూజారి ఇంట్లో చోరి...

**పదివేల నగదు అపహరించిన దొంగలు**

**సంఘటన స్థలాన్ని పరిశీలించిన సిఐ,ఎస్ లు**

వారధి న్యూస్ ,జగిత్యాల ప్రతినిధి

ఆలయ పూజారి ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చొరబడి పదివేల నగదును ఎత్తుకెళ్లిన సంఘటన జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని చిట్టాపూర్ గ్రామానికి చెందిన బుక్క రాజేశం అనే వ్యక్తి గ్రామంలోని మార్కండేయ స్వామి ఆలయంలో పురోహితం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. గత నెల 28 న వరంగల్ జిల్లాలోని అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో శివ కళ్యాణం చేయుట కోసం అక్కడికి వెళ్ళాడు.సోమవారం మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చేసరికి గుర్తుతెలియని దుండగులు తన ఇంటి తలుపు పగలగొట్టి బీరువాలో ఉన్న పదివేల రూపాయలు నగదును దొంగిలించినట్లు తెలిపారు. సిఐ నిరంజన్ రెడ్డి ,స్థానిక ఎస్సై కిరణ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ సహాయంతో ఆధారాలు సేకరించారు. బాధితుడు రాజేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

# మెడికల్ కళాశాల నూతన భవన తుదిదశ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**



నాగర్ కర్నూల్ ప్రభుత్వ మెడికల్ కళాశాల నూతన భవనాన్ని వైద్య విద్యార్థుల తరగతుల నిర్వహణకు అన్ని సదుపాయాలతో సంసిద్ధం చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. ఉయ్యాలవాడ సమీపంలో 25 ఎకరాల్లో నిర్మితమవుతున్న నూతన మెడికల్ కళాశాల భవనం మెడికల్ కళాశాల విద్యా ర్థుల (బాలబాలికలు) ప్రొఫెసర్ల వసతి గృహాలు నూతన భవనాలను, నూతనంగా నిర్మితమౌతున్న మెడికల్ కళాశాల తరగతి గదుల భవనాలను సోమవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన మెడికల్ కళాశాలలో చివరి దశలో ఉన్న పనులను వేగవంతం పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రానున్న రోజుల్లో నూతన మెడికల్ కళాశాల భవనాన్ని ప్రారంభించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

కలెక్టర్ వెంట మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమాదేవి, నాగర్ కర్నూల్ డిఎంహెచ్ఓ స్వరాజ్యలక్ష్మి, నాగర్ కర్నూల్ జర్నల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రఘు, ఇతర వైద్య కళాశాల సిబ్బంది వైద్యులు తదితరులు ఉన్నారు.

www.varadhinews.com
విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
జనరల్ న్యూస్



## ప్రజావాణి కార్యక్రమంలో 13 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ

వారధి న్యూస్, వనపర్తి:

వనపర్తి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 13 మంది పిర్యాదుదారుల నుండి సమస్యలను స్వీకరించారు. ఫిర్యాదులలో ఎక్కువగా భూసంబంధిత వివాదాలు మరియు పరస్పర గొడవల ఫిర్యాదులు ఉన్నట్లు ఎస్పీ తెలిపారూ.

12 ఫిర్యాదులు: భూ వివాదాలకు సంబంధించినవి, 1 ఫిర్యాదు: పరస్పర గొడవపై, ఈ ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడానికి సంబంధిత పోలీస్ స్టేషన్ సబ్ఇన్స్పెక్టర్లు (ఎస్ఐలు) మరియు సర్కిల్ ఇన్స్పెక్టర్లు (సిఐలు)కి ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుల పరిష్కారం చట్టప్రకారం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ, "ప్రజలు ఎటువంటి భయం లేకుండా, మూడో వ్యక్తి ప్రామాణికత లేకుండా తమ సమస్యలను స్వేచ్ఛగా పోలీసు శాఖకు నివేదించవచ్చు" అని తెలిపారు. సమస్యల పరిష్కారంలో పారదర్శకతను పాటించడం తమ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు పోలీసు శాఖ మరింత దగ్గరగా ఉండేందుకు కృషి చేస్తున్నామని వివరించారు.ప్రతి సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని ఎస్పీ తెలిపారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా స్వీకరించి, వేగంగా పరిష్కార మార్గాలను చూపడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని అన్నారు.

వనపర్తి జిల్లాలో శాంతి భద్రతలను మెరుగుపర్చడమే కాకుండా, ప్రజలకు అందుబాటులో ఉండే సేవలను అందించడం పోలీస్ శాఖ లక్ష్యమని తెలిపారు. "న్యాయబద్ధమైన పౌర సేవలు అందించడంలో ప్రజల విశ్వాసం పెంచుకోవడం అత్యంత ముఖ్యం" అని ఎస్పీ గిరిధర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొని ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేశారు.



## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- **అత్యవసర పరిస్థితుల్లో అండగా నిలబడాలి**
- **ప్రసవ వేదనతో వచ్చే మహిళల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలి.**
- **వైద్యపరమైన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి**

వారధి న్యూస్, వనపర్తి :

చికిత్సనిమిత్తం ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రోగులకు వైద్యులు మెరుగైన వైద్యం అందించాలని, అత్యవసర సేవలు అవసరం ఉండి వచ్చే వారికి వైద్యులే అండగా నిలబడాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.వైద్యపరమైన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. అత్యవసర వైద్య సేవలో కీలకంగా ఉపయోగించే లిక్విడ్ ఆక్సిజన్ యూనిట్ ను ఆయన ప్రారంభించారు.కోట్ల విలువచేసే ఆధునిక పరికరాలున్న వాటిని వినియోగించుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తే అవి నిర్వీర్యమైపోతాయని, ప్రతిదీ పర్యవేక్షిస్తూ వినియోగిస్తే ఎక్కువ కాలం ఉపయోగపడతాయని క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ ఉండాలని ఆయన వైద్యాధికారులకు సూచించారు.కరోనా కాలంలో అత్యవసర సేవలకు వినియోగించాలని ఏర్పాటుచేసిన ఆక్సిజన్ ప్లాంట్ నిర్వీర్యమైపోతుందని అందుకు సంబంధించిన వివరాలు సేకరించి కావలసిన మరమత్తులు చేయిస్తే బాగుంటుందని ఆ వివరాలను సేకరించాలని ఆయన అధికారులకు సూచించారు.

అనంతరం ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన కంటి పరీక్షలు మరియు శస్త్ర చికిత్స కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.అనంతరం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపి కేంద్రాన్ని, ఫార్మసీని, మినీ ఆక్సిజన్ ప్లాంట్ ని, లేబర్ రూమ్ (ప్రసూతి గది) తో పాటు లియోనాటిల్ కేర్ _(సరైన పోషకాలు అందక రక్తహీనత, బరువు తక్కువగా ఉండడం, ఎత్తు పెరగకపోవడం లాంటి ఇబ్బందులు ఉన్న చిన్నారులకు బలవర్ధకమైన ఆహారం అందిస్తూ వైద్యం అందించే వైద్య కేంద్రం)లను ఎమ్మెల్యే ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన అక్కడి సిబ్బందితో మాట్లాడి ఆసుపత్రి వివరాలను అడిగి తెలుసుకున్నారు.ప్రసవ వేదనతో ఆసుపత్రికి వచ్చే గర్భిణుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని, వారికి అందించాల్సిన వైద్య సేవలను సక్రమంగా అందించాలని, ఆయన వారికి సూచించారు.

అనంతరం ఆసుపత్రి ఓపి దస్త్రాలను పరిశీలించి ప్రతినిత్యం ఆసుపత్రికి వచ్చే వారి వివరాలను తెలుసుకున్నారు.కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం అధ్యక్షులు చిన్నారెడ్డి, DCCB చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, స్థానిక సంస్థల కలెక్టర్ సంచిత్ గ్యాంగ్వర్, మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, పెబ్బేర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా పడమటి అంజన్న బ్రహ్మోత్సవాలు

**ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి**

వారధి న్యూస్ మహబూబ్ నగర్,



నారాయణపేట జిల్లా మఖ్తల్ పడమటి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలను గతంలో ఎన్నడూ లేనంత అంగరంగ వైభవంగా, కురుమూర్తి, మన్యంకొండ జాతర ఉత్సవాల తరహాలో నిర్వహిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. ఆలయ ధర్మకర్త ప్రాణేశాచారి, ఈవో శ్యాంసుందరాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతర సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

ఈనెల 13 నుంచి 19వరకు ఉత్సవాలు జరగనుండగా...14వ తేదీ ప్రభోత్సవం, 15న రథోత్సవం, 16న పాల ఉట్లు జరగనున్నాయి.

ఈ సందర్భంగా ఉత్సవాల పోస్టర్లు, కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... మఖ్తల్ నలుమూలలా ఉత్సవాల స్వాగత తోరణాలను ఏర్పాటు చేసుకుందామని సూచించారు. మినీ ట్యాంక్ బండ్ నుంచి స్పెషల్ లైటింగ్, ఆంజనేయ స్వామి కటౌట్లు ఏర్పాటు చేయాలని అన్నారు. జాతర ఉత్సవాల్లో పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించాలని సూచించారు. మున్సిపాలిటీ పారిశుద్ధ్యం కోసం ఉత్సవాల కోసం తాత్కాలికంగా సిబ్బందిని నియమించుకోవాలని అన్నారు. తాగునీటి కోసం ఇబ్బంది లేకుండా, చుట్టు పక్కల పంచాయతీ ల నుంచి 30 వరకు ట్యాంకర్లు అందుబాటులో ఉంచాలని అన్నారు. జాతర ఉత్సవాల సమయంలో వీధి దీపాలు సరిచూసుకోవాలని, నిమిషం కరెంటు కోతలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆంబులెన్సులు సిద్ధంగా ఉంచి, అత్యవసర వైద్యం అందేలా చూడాలని వైద్యాధికారులకు సూచించారు. ఉత్సవాల సమయంలో ప్రత్యేక ఆర్టీసీ బస్సులు గ్రామాలకు ఉండేలా చూడాలని, ప్రతి బస్సుపై జాతర ఉత్సవాల పోస్టర్లు ఉండాలని అన్నారు. సీఎం రేవంత్ తోపాటు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ను ఉత్సవాలకు ఆహ్వానిస్తామని అన్నారు. రథోత్సవం ముందు రోజు ప్రభ సందర్భంగా స్వామి వారికి ఈనెల 14న పట్టు వస్త్రాలు సమర్పిస్తామని తెలిపారు. రహదారుల వెంబడి దుమ్ము, ధూళి రాకుండా నీళ్లు చల్లడం, ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా చూడటం, బారికేడ్లు అవసరమైన చోట ఏర్పాటు, గుడికి అడ్డంగా బ్యానర్లు కట్టరాదని తీర్మానించారు. ఉత్సవాల నిర్వహణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, స్వచ్ఛందంగా సేవ చేసేవారిని గుర్తించాలని అన్నారు. వీఐపీ దర్శనాలను నిలువరించి, సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు బాలక్రిష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, కట్టా సురేష్ గుప్తా, ఎ.రవి కుమార్, మల్లికార్జున్, రాజశేఖర్ రెడ్డి, తహసీల్దార్ సతీశ్, ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్య, మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్లు, ఎంపీడీవో రమేశ్, విద్యుత్ ఏఈ రామకృష్ణ, డాక్టర్ హబీబ్ , వల్లంపల్లి లక్ష్మణ్, మందుల నరేందర్, ఆలయ అర్చకులు అరవిందాచారి, సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అంకిత భావంతో పని చేయాలి

**జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్**

వారధి న్యూస్ మహబూబ్ నగర్,

విది నిర్వహణలో అంకిత భావంతో పని సవాళ్ల ను సమర్ధంగా ఎదుర్కోవాలని జిల్లా ఎస్పి యోగేష్ గౌతం అన్నారు.సోమవారం9 నెలల ట్రైనింగ్ పూర్తి చేసుకొని కొత్తగా విధుల్లో చేరుతున్న 78 కానిస్టేబుళ్లకు 47 మంది సివిల్ కానిస్టేబుల్లకు పోలీస్ స్టేషన్ వారిగా పోస్టింగ్ ఇచ్చారు. అలాగే 31 మంది అర్మడ్ రిజర్వు పోలీసులకు జిల్లా స్పెషల్ పార్టీ కి పోస్టింగ్ ఇచ్చి వారికి జిల్లా ఎస్పీ దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ పోలీసు శాఖలో పని చేయడం అనేది ప్రజలకు అత్యంత చేరువగా ఉంటూ సేవ చేసే గొప్ప అవకాశం అని పేర్కొన్నారు. పోలీసుశాఖ మిగిలిన ఇతర ప్రభుత్వ ఉద్యోగాలతో పోలిస్తే ఎంతో భిన్నమైనదని, ఎన్నో సవాల్లతో కూడుకున్నదని, మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. ప్రతి పోలీసు ఉద్యోగ బాధ్యతల్లో చేరిన మరుక్షణం నుండే ఎన్నో సవాల్లను ఎదుర్కొంటాడని శాంతి భద్రతల పరిరక్షణ కోసం అనుక్షణం పాటుపడతాడని పేర్కొన్నారు. పోలీసు శాఖలో ఏ హోదాలో ఉద్యోగంలో చేరినప్పటికీ ప్రతి ఒక్కరూ శాంతిభద్రతల పరిరక్షణలో సమాన ప్రాధాన్యత మరియు బాధ్యత కలిగి ఉంటారని అన్నారు. నూతన కానిస్టేబుళ్లకు ఉన్నతాధి కారుల నుండి సంపూర్ణ సహాయ సహకారాలు అందుతాయని, వారి సూచనలకు ఆదేశాలకు అనుగుణంగా క్రమశిక్షణ తో పని చేయాలని సూచించారు. నూతన కానిస్టేబుళ్లు అందరికీ వారి వారి శక్తి సామర్ధ్యాలకు, విభిన్న నైపుణ్యాలకు తగినట్టుగా అవకాశాలు కల్పించబడతాయని పేర్కొన్నారు. రోజురోజుకీ పెరుగుతున్న సైబర్ క్రైమ్ వంటి సాంకేతికపరమైన నేరాల నేపథ్యంలో అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వారిని అటువంటి చదువులు చదివిన వారికి సైబర్ క్రైమ్, ఐటి సెల్ వంటి విభాగాల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. నేర నియంత్రణలో శాంతిభద్రతల పరిరక్షణలో



సాంకేతిక పరిజ్ఞానాన్ని అత్యున్నత స్థాయిలో జిల్లలో పోలీసులు వినియోగిస్తున్నారని, అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరు తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. బాధతో పోలీసు స్టేషన్‌కు వచ్చే వారికి మేమున్నామనే భరోసా కల్పించాలని , విధి నిర్వహణలో కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యమివ్వాలన్నారు. పోలీసు శాఖలో పూర్తి బాధ్యతలు నిర్వహించేందుకు ఎంపిక చేయబడిని ప్రతి ఒక్కరు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. పోలీస్ జీవితంలో క్రమశిక్షణ ఎంతో ముఖ్యమైనదని, అధికారులు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. పోలీసులకు ప్రధాన బాధ్యత ప్రజల రక్షణ అని, వారి హక్కులకు, ఆత్మగౌరవానికి భంగం కలగకుండా ప్రజలతో మంచి నడవడికను అలవాటు చేసుకోవాలని చెప్పారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని కోరారు. ఈ ఉద్యోగంతోనే ఆగిపోకుండా ఆసక్తి ఉన్నవారు మరింత మంచి ఉద్యోగాల కోసం ఉన్నత హోదా కోసం శ్రద్ధగా తమ విశ్రాంతి సమయాన్ని వాడుకొని చదువుకోవాలని మరింత మంచి ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సూపర్డెంట్ శంకర్ లాల్, ఎస్బిఐ సిఐ రామ్ లాల్, ఆర్ ఐ నరసింహ, ఆర్ ఎస్సై లు శివశంకర్, రాములు పాల్గొన్నారు.



## అక్రమాలు, అవినీతి, ఆక్రమణలు అరికట్టాల్సిందే: అఖిలపక్ష ఐక్యవేదిక

వారధి న్యూస్, వనపర్తి:

జిల్లాలో జరుగుతున్న అక్రమాలు, అవినీతి, మరియు రోడ్లపై ఆక్రమణలను అరికట్టాలని అఖిలపక్ష ఐక్యవేదిక డిమాండ్ చేసింది. మున్సిపల్ అధికారులు కలెక్టర్ ఆదేశాలను పట్టించుకోకుండా పార్కింగ్ స్థలాలను ఇతర అవసరాలకు వాడుతున్నారని, దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఐక్యవేదిక సభ్యులు కోరారు.

**కలెక్టర్ ఆదేశాలను పట్టించుకోని మున్సిపల్ అధికారులు:**

ఐక్యవేదిక సభ్యులు సతీష్ యాదవ్ మాట్లాడుతూ, "జిల్లా కలెక్టర్ స్వయంగా షాపింగ్ మాల్స్ ప్రాంతాల్లో పార్కింగ్ కోసం రోడ్లను ఆక్రమించవద్దని ఆదేశించినప్పటికీ, మున్సిపల్ కమిషనర్ మరియు టౌన్ ప్లానింగ్ అధికారులు అవినీతిలో మునిగిపోతూ షాపింగ్ మాల్స్ యాజమాన్యంతో కుమ్మక్కవుతున్నారు" అని ఆరోపించారు.షాపింగ్ మాల్స్ ముందు పార్కింగ్ స్థలాలకు బదులుగా కూరగాయలు, ఐస్ క్రీమ్ షాపులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి రోడ్లను ఆక్రమిస్తున్నారని పేర్కొన్నారు. ఫిర్యాదులు చేసినా అధికారులు చర్యలు తీసుకోకపోగా, అక్రమాలకు సహకరిస్తున్నారని తెలిపారు.

**అవినీతి ఆరోపణలు:**

ఐక్యవేదిక ప్రతినిధులు, "మున్సిపల్ అధికారులు రోడ్లపై వ్యాపారులు, షాపింగ్ మాల్స్ యాజమాన్యాల నుండి డబ్బులు తీసుకుంటున్నారనే అపవాదులు ఉన్నాయి. ఇది ప్రజలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోంది" అని అన్నారు.

**ఐక్యవేదిక డిమాండ్లు:**

1. తక్షణం ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేశారు.
2. మున్సిపల్ అధికారులు తమ విధులను నిష్పాక్షికంగా నిర్వహించాలి.
3. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై విచారణ చేయాలి.
4. కలెక్టర్ ఆదేశాలను అమలు చేయని అధికారులను కఠినంగా శిక్షించాలని కోరారు.

"అధికారులు తమ విధులు నెరవేర్చకపోతే, ఐక్యవేదిక ప్రజల మద్దతుతో ఉద్యమం ప్రారంభిస్తుంది" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, కొత్త గొల్ల శంకర్, గౌనికాడి యాదయ్య, బొడ్డుపల్లి సతీష్, గంధం భరత్, శరత్ చంద్ర, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. "అవినీతి అధికారులు వదిలిపెట్టబడరని, చర్యలు తప్పనిసరి" అని ఐక్యవేదిక సభ్యులు పేర్కొన్నారు.



## నిజాయితీతో విధులు నిర్వర్తించి ఉన్నత స్థాయికి చేరాలి



**నూతన కానిస్టేబుళ్లకు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్ దిశానిర్దేశం**

వారధి న్యూస్, వనపర్తి:

వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో నూతన కానిస్టేబుళ్లకు దిశానిర్దేశ కార్యక్రమం సోమవారం ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నిజాయితీ, క్రమశిక్షణ, అంకిత భావం" పోలీసుల విధుల ప్రధాన లక్ష్యాలని అన్నారు. వనపర్తి జిల్లా నుండి 118 మంది కానిస్టేబుళ్లు వివిధ శిక్షణ కేంద్రాల్లో 9 నెలల శిక్షణ పూర్తిచేసి విధుల్లో చేరడానికి సిద్ధంగా ఉన్నారు. వీరిలో 85 మంది సివిల్ కానిస్టేబుళ్లు, 33 మంది ఆర్మడ్ కానిస్టేబుళ్లు, 29 మంది మహిళ కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరికి 15 రోజుల పాటు కోర్టు డ్యూటీ, భరోసా, సఖి, షి టీం, రిసెప్షన్, బందోబస్తు, CCTNS వంటి విభాగాల్లో శిక్షణ ఇస్తారని ఎస్పీ వివరించారు.

**భాదితులకు భరోసా:**

ఎస్పీ గిరిధర్ మాట్లాడుతూ, "పోలీసు స్టేషన్‌కి వచ్చే బాధితులకు భరోసా కల్పించడమే మీ మొదటి కర్తవ్యం. బాధితుల కోసం మీరు చేయగలిగిన సేవలు పోలీస్ వ్యవస్థపై విశ్వాసాన్ని పెంచుతాయి" అని తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

**నిర్వహణలో క్రమశిక్షణ:**

పోలీసు ఉద్యోగం అనేక సవాళ్లతో కూడుకున్నదని, ప్రతి కానిస్టేబుల్ మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని అన్నారు. క్రమశిక్షణ police వ్యవస్థను ముందుకు నడిపే ప్రధాన మూలం అని గుర్తు చేశారు. "నీతి, నిజాయితీతో పనిచేస్తే ప్రజలు పోలీసులపై విశ్వాసాన్ని కలిగి ఉంటారు," అని తెలిపారు.

**టెక్నాలజీ వినియోగంలో ముందున్న తెలంగాణ పోలీసులు:**

నూతన టెక్నాలజీని ఉపయోగించి నేర నియంత్రణలో తెలంగాణ పోలీస్ శాఖ ప్రత్యేక గుర్తింపు పొందిందని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆయన కోరారు.మీ సేవలతో వనపర్తి జిల్లా, తెలంగాణ పోలీసులకు మంచి పేరు తెచ్చేందుకు కృషి చేయాలి," అని ఎస్పీ గిరిధర్ కోరారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా అదనపు ఎస్పీ రాందాస్ తేజవత్, సాయుధ దళాల అదనపు ఎస్పీ వీరారెడ్డి, రిజర్వ్ ఇన్స్పెక్టర్ అప్పలనాయుడు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# కలెక్టరేట్‌లో ఆత్మహత్యకు యత్నించిన రైతును పరామర్శించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

వారధి న్యూస్, వనపర్తి:

వనపర్తి జిల్లా కలెక్టరేట్ లో ఆత్మహత్యకు యత్నించిన ఎదుట్ల గ్రామానికి చెందిన నరెడ్ల సాయిరెడ్డి అనే రైతును మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆసుపత్రిలో పరామర్శించారు. భూమి వివాదం కారణంగా న్యాయం దక్కలేదన్న ఆవేదనతో సాయిరెడ్డి కలెక్టర్ ఎదుటే పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు.సాయిరెడ్డిని ఆసుపత్రిలో పరామర్శించిన నిరంజన్ రెడ్డి అతడికి ధైర్యం చెప్పి, "ఆత్మహత్య ఎప్పుడూ సమస్యలకు పరిష్కారం కాదు. మన సమస్యలను చట్టపరంగా ముందుకు తీసుకెళ్లాలి" అని అన్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.



**కాంగ్రెస్ పాలనపై విమర్శలు:**

ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ , కాంగ్రెస్ పాలనలో శాంతి భద్రతలు కరువైన పరిస్థితి నెలకొందని విమర్శించారు. "రైతుల పండుగలు జరుగుతుంటే, అదే సమయంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇది దురదృష్టకరం" అని వ్యాఖ్యానించారు. సాయిరెడ్డి తన భూమిని ఆక్రమించిన దాయాదుల నుండి న్యాయం కోసం పలుమార్లు పోలీసులను, రెవెన్యూ అధికారులను ఆశ్రయించినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. అధికార పార్టీ ఒత్తిళ్ల కారణంగా పోలీసులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని చెప్పారు. "అధికారులు చట్టపరంగా, నిష్పాక్షికంగా వ్యవహరించాలి. పోలీసు స్టేషన్లు రాజకీయ ఒత్తిళ్లకు వేదికలు కాకూడదు. ఇది ప్రజాస్వామ్యానికి హానికరం" అని ఆయన హెచ్చరించారు.

**సమస్య పరిష్కారం కోసం డిమాండ్:**

సాయిరెడ్డికి న్యాయం జరిగేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. "రైతుల సమస్యలను పట్టించుకోవడం ప్రభుత్వ బాధ్యత" అని గుర్తుచేశారు.సాయిరెడ్డితో పాటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇతర రోగులను కూడా పరామర్శించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. "రైతులు ధైర్యంగా ఉండి తమ సమస్యలను చట్టపరంగా పరిష్కరించుకోవాలని" ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో పి. రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్, చిట్యాల రాము, రవికుమార్, నాగేంద్రము తదితరులు పాల్గొన్నారు.



## ఎయిడ్స్ వ్యాధి పై అవగాహన కలిగి ఉండాలి

**ఎమ్మెల్యే మేఘా రెడ్డి**

వారధి న్యూస్, వనపర్తి :

ప్రాణాంతకమైన వ్యాధుల్లో ఒకటైనా ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ సందర్భంగా పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అవగాహన ర్యాలీని ఆయన జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, స్థానిక సంస్థల కలెక్టర్ సంచిత్ గ్యాంగ్వర్ తో కలిసి సోమవారం జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎయిడ్స్ వ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, ఎయిడ్స్ వ్యాధికి నివారణ తప్ప వేరే మార్గం లేదని ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకుంటూ వైద్యులు సూచించిన సలహాలను పాటిస్తూ ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, జిల్లా గ్రంథాలయాల చైర్మన్ గోవర్ధన్ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, పెబ్బేర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు, సరిత తిరుపతిరెడ్డి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తికి అడ్డుకట్ట వేయాలి

**-జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:

అవగాహనతోనే ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తిని నియంత్రించవచ్చునని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాగర్ కర్నూల్ కలెక్టరేట్లో అవగాహన ర్యాలీలో ఎయిడ్స్ నియంత్రణపై ప్రతిజ్ఞ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం తో కలిపి కలెక్టర్ బాదావత్ సంతోష్ పాల్గొన్నారు. ఎయిడ్స్ నియంత్రణపై డిఎంహెచ్ఓ స్వరాజ్యలక్ష్మి ప్రతిజ్ఞ చేయించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...... ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు భరోసా నివ్వడం ద్వారా వారిలో ఆత్మ స్థైర్యాన్ని నింపవచ్చన్నారు.ఇందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. ఎయిడ్స్ వ్యాధి నివారణకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని తెలిపారు. ఎయిడ్స్పై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని నిరోధించగలమన్నారు. ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని, అప్రమత్తంగా ఉంటూ వ్యాధిని ఎండి కట్ట వేయాలని, ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ స్వరాజ్యలక్ష్మి, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ వెంకట దాస్, వైద్యులు, ఏఎన్ఎంలు, విద్యార్థులు డిఎంహెచ్వో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కంఠంమహేశ్వర స్వామి పండుగ సందర్భంగా గౌడ కులస్తులు మాలధారణ

వారధిన్యూస్,మహబూబాబాద్ ప్రతినిధి:

మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరు మండల కేంద్రంలో గౌడ కులస్తులు శ్రీ కంఠం మహేశ్వర స్వామి పండుగ సందర్భంగా పురుషులు మాలధారణ వేశారు,గౌడ కులస్తుల ఆరాధ్య దైవం,కుల దేవుడు శ్రీ కంఠం మహేశ్వర స్వామి పండుగ చిన్న గూడూరు గ్రామంలో వారం రోజులు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు,పండుగ ప్రారంభం రోజున పురుషులు కుల పండితుల వేద మంత్రాల మధ్య మాల ధారణ ధరిస్తారు,చిన్న పెద్దలు అందరూ భక్తి శ్రద్ధలతో పూజించి పండుగను ఘనంగా వారం రోజులపాటు జరుపుకుంటారు



## బస్సు ఢీకొని ఇద్దరు విద్యార్థులకు గాయాలు...

వారధి న్యూస్, పాపన్నపేట:

ఆర్ టి సి బస్సు ఢీకొని ఇద్దరు విద్యార్థులు తీవ్ర గాయాలపాలైన సంఘటన మండల పరిధిలోని నార్సింగి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ సంగన్న, స్థానికులు కథనం మేరకు... నార్సింగి గ్రామానికి చెందిన అఖిల, విజయ అనే ఇద్దరు విద్యార్థులు సోమవారం ఉదయం కళాశాలకు వెళ్లేందుకు ఇంటి నుండి బయలుదేరారు. గ్రామ ఎక్స్ రోడ్డు వద్ద బస్సు ఎక్కేందుకు వేచి ఉండగా బొడ్మట్ పల్లి నుండి మెదక్ వైపు వెళ్తున్న ఆర్టీసి బస్సు వీరిని ఢీ కొట్టింది. దీంతో అఖిలకు తీవ్ర రక్త గాయాలయ్యాయి.విజయకు సైతం తీవ్ర గాయాలయ్యాయి.అక్కడే ఉన్న స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం వెంటనే 108లో మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు




ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణమైన బస్సును ఠాణాకు తరలించారు. బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో ప్రమాదం జరిగిందని కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.



## ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి


- **ప్రజా వాణి కి 53 దరఖాస్తులు**
- **జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు చొరవచూపి దరఖాస్తుదారులకు న్యాయం చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన 'ప్రజావాణి'లో బాధితుల నుంచి 53 దరఖాస్తులు తీసుకొని దరఖాసుదారుల సమస్యలపై కలెక్టర్ మాట్లాడారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి శాఖలో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు.శాఖల వారిగా ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కే సీతారామారావు, దేవ సహాయం, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్ లు యూసుఫ్ అలీ, చెన్న కేశవులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ యాక్ట్ అమలు

వారధి న్యూస్ మహబూబ్ నగర్,



మహబూబ్ నగర్ జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా, ప్రశాంతత ను పెంపొందించేందుకు 02 డిసెంబర్ 2024 నుండి 01 జనవరి 2025 వరకు, జిల్లా అంతటా 30 పోలీస్ ఆక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపిఎస్. సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 30 పోలీస్ఆక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నత అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగులు, ఊరేగింపులు, ధర్నాలు జరుపరాదు. నిషేదిత ఆయుధములు అయిన కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు ప్రేలుడు పదార్థములు, నేరమునకు పురిగొల్పే ఎటువంటి ఆయుధములను వాడరాదు. ప్రజలకు ఇబ్బంది, చిరాకు కలిగించేందుకు దారితీసే పబ్లిక్ మీటింగ్ లను మరియు జన సమూహం ప్రోగు అవుట వంటివి నిషేధం. రాళ్ళను జమ చేయుట, ధరించి సంచరించుట వంటివి నిషేధం. లౌడ్ స్పీకర్ లు, డీజే లు వంటివి కూడా ఈ సమయంలో నిషేధము. నియమాలు ఎవరైనా ఉల్లంఘించిన 30 పోలీస్ ఆక్ట్ 1861 కింద శిక్షార్హులు అగుదురని ఎస్పి పేర్కొన్నారు.



## దివ్యంగులకు 6000 పెన్షన్ వెంటనే పెంచాలి

- **న్యాయపరమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలి.**
- **ఫరూఖ్ నగర్ నగర్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష**
- **మద్దతు ప్రకటించిన సిఐటియు రాజు, జై స్వరాజ్ పార్టీ ఆంజనేయులు, టిడిపి మఠం శశిధర్,**

వారధి న్యూస్, షాద్ నగర్:-

రాష్ట్ర వ్యాప్తంగా వికలాంగుల పెన్షన్ 6000లకు పెంచాలని, పెండింగ్లో ఉన్న ఆసరా పెన్షన్స్ వెంటనే మంజూరు చేయాలని వికలాంగుల జాతీయ వేదిక రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫరూక్ నగర్ మండలం ఎంపీడీవో కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి టిడిపి నేతలు పటం శశిధర్ ,సిఐటియు జిల్లా అధ్యక్షుడు రాజు, శీను , జై స్వరాజ్ పార్టీ మార్ల ఆంజనేయులు మద్దతు ప్రకటించారు. అనంతరం ఆర్డీవో సరితకు వినత వినతిపత్రాన్ని అందజేశారు . ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమపై మొండి వైఖరి ప్రదర్శిస్తున్నారని , ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం 6000 పెన్షన్ పెంపుకు కాలయాపన చేస్తుందని అవేదన వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం 2011నుండి వికలాంగులకు 300 రూపాయలే పెన్షన్ ఇస్తుందాని ధరల పెరుగుదలకు అనుగుణంగా పెన్షన్ 3000 లకు పెంచాలని డిమాండ్ చేశారు. డిసెంబర్‌లో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశంలో 15 శాతం మంది వికలాంగులు ఉన్నారని, వారికి సామాజిక భద్రత కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని,పెంచన్ 6000 పెంచాలని, ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని, బ్యాక్ లగ్ పోస్టుల అవకాశాలు కల్పించాలని, ఆర్థిక రుణాలు, ఉపపరికారాలు అందజేయాలని, అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్లకు మొదటి ప్రాధాన్యత దివ్యాంగులకు కల్పించాలని డిమాండ్ చేశారు. వికలాంగుల సంక్షేమం కోసం వివిధ ప్రభుత్వ రంగాల్లోని ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని, ప్రైవేట్ సంస్థల్లో 5 శాతం ఉద్యోగాలు వికలాంగులకు ఇవ్వాలని కోరారు. అదనంగా, వికలాంగుల క్రీడల అభివృద్ధి కోసం ప్రత్యేక పాలసీ ప్రకటించాలని, వికలాంగుల విద్యా అభివృద్ధికి ప్రత్యేక విద్యా విధానం ఏర్పాటు చేయాలని, 2016 ఆర్పిడి చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఎన్పి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అశన్నగారి భుజంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్కొని రాజు, షాద్ నగర్ డివిజన్ అద్యక్షుడు శేఖర్ గౌడ్, కృష్ణయ్య,రమేష్, సుగనయ్య, బేబీ కాజు, ఆర్మియన్ శేహిన్, ఓసియా బేగం, సంతోష, సయతి, కుషుమ, మనీలా,మల్లేష్, శ్రీనాథ్, మసూద్, అంజయ్య కిష్టయ్య, అబ్దుల్ గఫీర్, యాదయ్య, శ్రీకాంత్, తదితరుల పాల్గొన్నారు.



## సిఎం పర్యటన సందర్భంగా కమిషనరేట్ పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం...

- పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్...

వారధి న్యూస్ ,గోదావరిఖని :

డిసెంబర్ 04న. పెద్దపల్లి లో ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, కార్యక్రమం సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సీపీ తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ లో రామగుండం పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ అధ్యక్షతన, రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి డీసీపీ, ఏసీపీ లు, సీఐ లు, ఎస్ఐ లతో బందోబస్త్ ఏర్పాట్లు, పార్కింగ్ స్థలాలు, విఐపి లు వచ్చే మార్గాలు, ప్రవేశ మార్గాలు, సభకు వచ్చే ప్రజల రాకపోకల సౌకర్యం, ట్రాఫిక్ మార్గ దర్శకాల పై, ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రత్యేక ప్రాంతాలు గుర్తింపు అనుగుణంగా ఏర్పాట్లు, వివిధ శాఖల సమన్వయం, అత్యవసర పరిస్థితిలలో అంబులెన్స్, ఫైర్ సర్వీస్ గురించి, బందోబస్త్ విధులకు సంబందించిన డ్యూటీ చార్ట్ స్పష్టంగా కేటాయింపు, స్పెషల్ టీమ్ ల ఏర్పాట్లు తదితర అంశాలపై సమీక్షా సమావేశంలో అధికారులతో చర్చించి సలహాలు, సూచనలు, ఆదేశాలు జారీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి డిసిపి చేతన , మంచిర్యాల డీసీపీ భాస్కర్ , అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, గోదావరిఖని ఏసీపీ రమేష్, పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, సిసిఎస్ ఏసీపీ వెంకటస్వామి, టాస్క్ ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, ఏ ఆర్ ఏసీపీ సుందర్ రావు, వివిధ వింగ్స్ ఇన్స్పెక్టర్ లు, సీఐ లు, ఎస్ఐ లు పాల్గొన్నారు.



## విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేయాలి

-జిల్లాఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్.

వారధిన్యూస్,మహబూబాబాద్ ప్రతినిధి:

ట్రైనింగ్ పూర్తి చేసుకొని కొత్తగా విధుల్లో చేరనున్న కానిస్టేబుళ్లకు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్ దిశానిర్దేశం చేశారు. మహబూబాబాద్ జిల్లా నుండి 96 సివిల్, 46 ఏఆర్ కలిపి మొత్తం 142 మంది సెలెక్ట్ అయి 9 నెలల కఠినమైన పోలీస్ శిక్షణ పూర్తి చేసుకుని మహబూబాబాద్ జిల్లాలో విధులు నిర్వహించడానికి రావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో పని చేయడం అనేది ప్రజలకు అత్యంత చేరువగా ఉంటూ సేవ చేసే గొప్ప అవకాశం అన్నారు. పోలీసుశాఖ మిగిలిన ఇతర ప్రభుత్వ ఉద్యోగాలతో పోలిస్తే ఎంతో భిన్నమైనదని, ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. ప్రతి పోలీసు ఉద్యోగి బాధ్యతల్లో చేరిన మరుక్షణం నుండే ఎన్నో సవాల్లను ఎదుర్కొంటాడని, శాంతి భద్రతల పరిరక్షణ కోసం అనుక్షణం పాటుపడతాడని పేర్కొన్నారు. పోలీసు శాఖలో ఏ హోదాలో ఉద్యోగంలో చేరినప్పటికీ ప్రతి ఒక్కరూ శాంతిభద్రతల పరిరక్షణలో సమాన ప్రాధాన్యత మరియు బాధ్యత కలిగి ఉంటారని అన్నారు. పోలీస్ జీవితంలో క్రమశిక్షణ ఎంతో ముఖ్యమైనదని, అధికారులు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. పోలీసులకు ప్రధాన బాధ్యత ప్రజల రక్షణ అని, వారి హక్కులకు, ఆత్మగౌరవానికి భంగం కలగకుండా ప్రజలతో మంచి నడవడికను అలవాటు చేసుకోవాలని చెప్పారు. ఈ..ఉద్యోగంతోనే ఆగిపోకుండా ఆసక్తి ఉన్నవారు మరింత మంచి ఉద్యోగాల కోసం ఉన్నత హోదా కోసం శ్రద్ధగా తమ విశ్రాంతి సమయాన్ని వాడుకొని చదువుకోవాలని మరింత మంచి ఉద్యోగాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ శ్రీనివాస్, ఎస్ బి ఇన్స్పెక్టర్ చంద్రమౌళి, డిసిఆర్ బి ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఆర్ఐలు అనిల్, సోములు,నాగేశ్వ్రరావు, ఆర్ఎస్ఐ శేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

వారధి న్యూస్_ఆత్మకూరు.,

ఆత్మకూరు., ఆత్మకూరు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం నందు సోమవారం పట్టణ మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పంపిన చేశారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ షేక్ చాంద్ పాషా, ఎంపీడీవో శ్రీరామ్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ గాయత్రి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, పరమేష్, ఎన్ శ్రీనివాసులు, రహమతుల్లా, తులసి రాజు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# రైతుల్లో... రుణమాఫీ జోష్..

- మెదక్ జిల్లా పరిధిలో నాలుగో విడతలో మొత్తం 7.248 మందికి ప్రయోజనం
- రైతు బ్యాంకు ఖాతాల్లో రూ. 56.87 కోట్లు జమ
- ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ అమలు ఘనత
- ఇప్పటికే మెదక్ జిల్లాలో రూ.82.294 కోట్ల మాఫీ
- మూడు విడతల్లో రూ.604.21 మంది రైతులకు ప్రయోజనం
- ప్రభుత్వ హామీ నెరవేరడంతో హర్షం వ్యక్తం చేస్తున్న రైతన్నలు.

వారధి న్యూస్ మెదక్ జిల్లా ప్రతినిధి




కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రైతంగానికి నాలుగో విడతలుగా రూ. రెండు లక్షల రుణమాఫీ అమలు చేయడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పక్కాగా అమలు చేయడంతో మెదక్ జిల్లాలో రైతులకు పెద్ద ఎత్తున రుణమాఫీ జరిగి విముక్తులవుతున్నారు. ఇప్పటికే మొదటి. రెండవ. మూడవ విడతలుగా రుణమాఫీ డబ్బు బ్యాంకుల్లో రైతుల ఖాతాలకు చమకాగా. తాజాగా మహబూబ్నగర్లో జరిగిన రైతు పండుగ ద్వారా 4 వా విడత రుణమాఫీ జమ కావడంతో సంబరాలు నెలకొన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం నుండి నాలుగవ విడతగా రూ. రెండు లక్షల రుణమాఫీ ఏకకాలంలో అమలవుతుండడంతో మెదక్ జిల్లాలో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాల్గవ విడత రుణమాఫీ రాష్ట్రంలో ఉన్న 3.14 లక్షల మంది రైతులకు రూ.3 వేల కోట్ల వరకు విడుదల చేయడంతో రైతుల్లో పండగ వాతావరణం నెలకొని సంబరాలు చేస్తున్నారు. మహబూబ్నగర్లో పెద్ద ఎత్తున రైతు పండగ నిర్వహించి నిధులు విడుదల చేయడంతో గతంలో సాంకేతిక కారణాలవల్ల నిలిచిపోయిన రైతులకు నిధులు విడుదల అవుతున్నాయి. దీంతో రుణమాఫీ పూర్తయిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు మెదక్ జిల్లాలో తాజాగా నాలుగో విడత రుణమాఫీ కింద 7.248 మంది రైతులకు రూ.56.87 కోట్ల రుణమాఫీ జరిగింది. అదేవిధంగా జిల్లాలో రైతులకు రుణమాఫీ అమలైంది.ఈ మేరకు మండలాలు గ్రామాల వారిగా రైతులు బ్యాంకు ఖాతాల్లో రుణమాఫీ డబ్బు జమ చేస్తుండడంతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. ఇప్పటికే బ్యాంకులవారీగా జాబితాలు. రైతుల పేర్లు ఖరారు చేసిన అధికారులునిధులు విడుదల చేస్తున్నారు.

**ఇప్పటికే మెదక్ జిల్లాలో82.294 కోట్ల రుణమాఫీ:**

మెదక్ జిల్లాలో మొదటి. రెండవ. మూడవ విడతరుణమాఫీద్వారా మొత్తంరూ.604.21 మంది రైతు కుటుంబాలకు రుణమాఫీ కలిగింది. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు మొదటి.రెండవ. విడత రుణమాఫీ అమలు కావడం. మూడవ విడత నిధులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుండడంతో రైతులు వర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క.. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు.. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

### రైతులు బ్యాంకులను సంప్రదించాలి. మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్.



మెదక్ జిల్లాలో నాలుగో విడత రుణమాఫీ ద్వారా మొత్తం.7.248 మంది రైతులకు రూ.56.87 కోట్ల రుణం మాఫీ అయినట్లురుణమాఫీ నిధులు విడుదల అయ్యాయని. నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ కానున్నాయని మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ తెలిపారు. రుణమాఫీ నిధులు విడుదలైన నేపథ్యంలో డి ఏ ఓ వారధి ప్రతినిధితో మాట్లాడుతూ రుణమాఫీ పొందిన రైతులు సంబంధిత బ్యాంకులను సంప్రదించి రుణమాఫీ వివరాలు పొందవచ్చని పేర్కొన్నారు.



## మున్సిపల్ ఆధ్వర్యంలో ర్యాలీ

వారధి న్యూస్ _ఆత్మకూర్.,

ఆత్మకూరు పట్టణంలో సోమవారం మున్సిపల్ వారి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించడం జరిగింది. మున్సిపల్ కార్యాలయం నుండి గాంధీ చౌక్ వరకు వివిధ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సి శశిధర్ మాట్లాడుతూ.. డిసెంబర్ 10 నుండి మున్సిపాలిటీలు ప్లాస్టిక్ కవర్లు వాడటం అమ్మడం నిషేధించడం జరుగుతుందని, ఎవరైనా అతిక్రమిస్తే 3,000 వేల నుండి 10,000 వరకు జర మన విధించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గాయత్రి రవికుమార్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, ఆర్పీలు,వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## 25 కోట్లతో నల్లమల్ల టూరిజం అభివృద్ధి

-అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

నల్లమల్ల అటవీ ప్రాంతాన్ని టూరిజం హబ్ గా అభివృద్ధి చేయడానికి గాను రాష్ట్ర ప్రభుత్వం 25 కోట్ల నిధులను మంజూరు చేసిందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీ కృష్ణ అన్నారు నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం అంబేద్కర్ ప్రజా భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణకు తలమానికంగా మారిన అమ్రాబాద్ నల్లమల్ల ప్రాంతంలోని పర్యాటక ప్రాంతాలైన ఉమామహేశ్వరం, మల్లెల తీర్థం, లొద్ది మల్లయ్య, సలేశ్వరం, అక్కమ్మ దేవి గుహలు, బౌరాపూర్ చెరువు, దత్త పాదాలు, ఆక్టోపస్, యు పాయింట్, కదిలివనం, వజ్రాల గట్టు,ప్రతాప రుద్రుని కోట, నరసింహుల వాగు, రాయల గండి, గున్న పెంట, పెద్ద రేవు, మద్దిమడుగు అంతర్గంగా నల్లమల్ల భైరవకోన ప్రాంతాలను టూరిజం ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నల్లమల్ల ప్రాంతంలో ఉన్న పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి పరచడం ద్వారా ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది అన్నారు. నల్లమల్ల ప్రాంత టూరిజం అభివృద్ధి కోసం నిధులు కేటాయించడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్ట అనంతరెడ్డి, రామనాథం, నరసయ్య యాదవ్, కటకం రఘురాం పాల్గొన్నారు.



## ఘనంగా ఆరోగ్య ఉత్సవాలు, ప్రజాపాలన

- - ప్రజా విజయోత్సవాలు భాగంగా పాల్గొన్న నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కాలం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తున్నారు,అందులో భాగంగా ఈ రోజు ఆరోగ్య దినోత్సవం కార్యక్రమం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, హైదరాబాద్ నుండి వర్చువల్ విధానం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నర్సింగ్ కాలేజీలు ప్రారంభించినారు. నాగర్ కర్నూల్ ఉయ్యాలవాడ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ , మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమాదేవి, నాగర్ కర్నూల్ డిఎంహెచ్ఓ స్వరాజ్యలక్ష్మి, నాగర్ కర్నూల్ జర్నల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రఘు, వైద్య, నర్సింగ్ విద్యార్థిని, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ... నాగర్ కర్నూల్ జిల్లాలో పారామెడికల్ కోర్సులను అందుబాటులోకి తేవడంతో జిల్లాలో విద్యార్థులకు లాభసాటిగా ఉంటుందని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎంతగానో తోడ్పాటు అందుతుందని తెలిపారు. ప్రజా విజయవత్సవాల్లో భాగంగా సోమవారం వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన పలు కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలిపారు. అందులో భాగంగానే నాగర్ కర్నూల్ ప్రభుత్వ జర్నల్ ఆస్పత్రిలో ప్రత్యేకంగా ట్రాన్స్ జెండర్లకు క్లినిక్ ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.



## ఘనంగా ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం

వారధి,న్యూస్.నాగర్ కర్నూలు బ్యూరో:

రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్ కర్నూల్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ హెచ్ఐవి ఎయిడ్స్ డే ను మదర్ రూరల్ డెవలప్మెంట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ
సెక్రటరీ సబిత పాల్గొని మాట్లాడారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం ప్రతి సంవత్సరం డిసెంబర్ 1వ తేదీన నిర్వహిస్తారు లోకేష్ చింతాడ ద్వారా ఎయిడ్స్ వ్యాధి కనుగొనడం జరిగిందని ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన పెంచడం ఎయిడ్స్ వ్యాధితో మరణించిన వారిని స్మరించుకోవడం ఎయిడ్స్ వ్యాధి కారక హెచ్ఐవికి వ్యతిరేకంగా పోరాటం కోసం ఈ రోజును జరుపుకుంటారను. హెచ్ఐవి రహిత సమాజం కోసం పాటుపడదాం హెచ్ఐవి ఉన్నవారిపట్ల వివక్ష వద్దు ఎయిడ్స్ ను సంపూర్ణంగా నాశనం చేద్దాం ఎయిడ్స్ ను అరికట్టటానికి బాధ్యతగా నడుచుకుందాం మన స్వతంత్ర భారతదేశంలో ఎన్నో ప్రభుత్వాలు స్వచ్ఛంద సంస్థలు ఈ ఎయిడ్స్ నిర్మూలించడానికి కృషి చేస్తున్నాయని ఇట్టి కార్యక్రమంలో సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com

# Movie Time మూవీ టైమ్



## సూపర్ స్టార్ ఉపేంద్ర 'UI ది మూవీ' వార్నర్

కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర స్వీయ దర్శకత్వంలో ఫస్ట్ అఫ్ ఇట్స్ కైండ్ ఫిల్మ్ 'UI ది మూవీ' చిత్రంతో రాబోతున్నారు. లహరి ఫిల్మ్స్, జి మనోహరన్ & వీనస్ ఎంటర్‌టైనర్స్ కెపి శ్రీకాంత్ నిర్మిస్తున్నారు. నవీన్ మనోహరన్ సహ నిర్మాత. ఈ రోజు, మేకర్స్ వార్నర్‌తో ముందుకు వచ్చారు, ఇది మూవీ వరల్డ్ లో ఒక గ్లింప్స్ ని అందిస్తోంది. కథ 2040 సంవత్సరంలో జరుగుతుంది, గ్లోబల్ వార్మింగ్, COVID-19, ద్రవ్యోల్బణం, ఏఐ, నిరుద్యోగం, యుద్ధం యొక్క నిరంతర ముప్పు అస్తవ్యస్తమైన, బాధాకరమైన సమాజానికి దారి తీస్తాయి. వినాశకరమైన పరిస్థితులు ఉన్నప్పటికీ, సామాజిక విభజనలు పాతుకుపోయాయి. కులం,మతం, సంఘర్షణ, విభజన మూలాలుగా వ్యక్తుల జీవితాల మారుస్తాయి.ఈ డిస్టోపియన్ వరల్డ్ లో ఉపేంద్ర నియంత గా కనిపించారు. మార్పు కోసం, న్యాయం కోసం, మంచి భవిష్యత్తు కోసం కష్టజీవుల నిరసనలకు దిగుతారు. ఇప్పుడు పవర్ ఫుల్ గా ఎంట్రీ ఇచ్చిన ఉపేంద్ర రూత్ లెస్ గా కనిపించారు.

## 'కన్నప్ప'లో మంచు కూతుళ్ళు



డైనమిక్ హీరో విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన 'కన్నప్ప' చిత్రం నుంచి వస్తున్న ప్రతీ అప్డేట్ ఆడియెన్స్‌లో అంచనాలు పెంచేస్తూనే ఉన్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. అత్యంత భారీ క్రేజీ పాన్-ఇండియా ప్రాజెక్ట్ అయిన ఈ 'కన్నప్ప' ఏప్రిల్ 25, 2025న విడుదల కానుంది. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సంబంధించిన మరో అప్డేట్‌ను సోమవారం నాడు రిలీజ్ చేశారు. కన్నప్ప ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రతీ సోమవారం ఓ అప్‌డేట్ ఇస్తామని మేకర్లు ఇది వరకు ప్రకటించారు. ఇందులో భాగంగా విష్ణు మంచు పిల్లలు అరియానా మంచు, వివియానా మంచు ఫస్ట్ లుక్‌లను విడుదల చేశారు. అంతే కాకుండా ఈ రోజు విష్ణు మంచు కవల కుమార్తెల పుట్టినరోజులు కావడం కూడా విశేషం.ఈ పోస్టర్‌లో పిల్లలిద్దరూ గిరిజన వేషధారణలో చాలా డిఫరెంట్‌గా కనిపిస్తున్నారు. శ్రీ కాళహస్తి పురాణ కథ ప్రాముఖ్యతను చాటి చెప్పే పాటలో కనిపించనున్నారు. 'పాట పాడినా, నృత్యం చేసినా, ఇది శివుని కోసం' అని ఈ పోస్టర్‌లో చూపించారు. ఈ మేరకు విష్ణు మంచు పోస్ట్ చేస్తూ.. 'పుట్టినరోజు సందర్భంగా నా కుమార్తెల ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది అన్నారు.

## కీర్తిసురేశ్ వెడ్డింగ్‌కు గోవాలో అదిరిపోయే ప్లాన్..!



నేషనల్ అవార్డ్ విన్నింగ్ బ్యూటీ కీర్తిసురేశ్ (వ్యాపారవేత్త ఆంథోని తట్టిల్‌ను వివాహం చేసుకోబోతున్న విషయం తెలిసిందే. వెడ్డింగ్ డేట్‌పై త్వరలో క్లారిటీ ఇవ్వనున్నారు కుటుంబసభ్యులు. కాగా వెడ్డింగ్ ఎలా ఉండబోతుందనే దానిపై ఆసక్తికర వార్త తెరపైకి వచ్చింది. తాజా సమాచారం ప్రకారం థీమ్ బేస్డ్ వెడ్డింగ్‌ను ప్లాన్ చేస్తున్నారట. రెండు రోజులపాటు జరుగనున్న ఈ వేడుకల్లో మూడు ఈవెంట్స్ ఉండబోతుండగా.. వీటిలో ఒక్కోటి ఒక్కో థీమ్‌తో ఉండనున్నాయని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు హిందూ, క్రిస్ట్రియన్ సంప్రదాయాల ప్రకారం కీర్తిసురేశ్ వెడ్డింగ్ జరుగనుండగా.. దీనికి సంబంధించిన ఏర్పాట్లు కూడా చకచకా జరుగుతున్నాయట. కీర్తిసురేశ్ ప్రస్తుతం వరుణ్ ధవన్‌తో కలిసి బేబిజాన్ సినిమాలో నటిస్తోంది. కీర్తిసురేశ్‌కు ఇది హిందీలో తొలి సినిమా. ఈ చిత్రం డిసెంబర్ 25న గ్రాండ్‌గా విడుదల కానుంది. మరోవైపు రివాల్వర్ రీటా సినిమాలో కూడా నటిస్తోంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది.